

ఎంపి ఈటల రాజేందర్‌కు మొక్కని అందజేస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్..

పెన్ పవర్
తెలంగాణ రౌండప్



మొక్కను నాటి నీళ్ళు పోస్తున్న ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి..

- మేడ్చల్ జిల్లా రిజర్వ్ ఫారెస్టులో భారీగా మొక్కలు నాటిన అధికారులు..
- ఈ వృక్షారోపణలో పాల్గొన్న ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి..
- మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీ) ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు..
- పర్యావరణ పరిరక్షణపై పలువురికి అవగాహనా కార్యక్రమాలు..
- అర్బన్ ఫారెస్ట్ పార్కుల ఫోటో ప్రదర్శన ఎన్జీవో సభ్యులకు ప్రశంసా పత్రాలు..

# మేడ్చల్ జిల్లా రిజర్వ్ ఫారెస్ట్‌లో..! హై డెన్సిటీ ప్లాంటేషన్..!

## అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకలు..!

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 5:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 సందర్భంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యాన మేడ్చల్ రిజర్వ్ ఫారెస్టులో హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం థీమ్ అయిన "ప్రకృతి స్ఫూర్తితో వాతావరణం, మన భవిష్యత్తు కోసానికి" అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా అటవీ అధికారి వేణుమాధవ రావు, వివిధ మున్సిపల్ చైర్‌పర్సన్లు, జిల్లా స్థాయి అధికారులు, ఎన్జీవో ప్రతినిధులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.. అతిథులు ఈటల రాజేందర్, మల్లారెడ్డి, హై డెన్సిటీ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సహజ వనరుల పరిరక్షణతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు..





మొక్కలు నాటుతున్న అటవీశాఖ సిబ్బంది, ఎన్జీవోలు..



మొక్కను నాటి నీళ్ళు పోస్తున్న మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్, ఫైజాన్ అహ్మద్..



అటవీశాఖ అధికారులతో ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి..

## అటవీశాఖ కార్యక్రమాల ఫోటో ప్రదర్శన..

కార్యక్రమంలో భాగంగా అటవీ సంరక్షణ, వృక్షారోపణ, జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి రంగాల్లో అటవీ శాఖ చేపట్టిన పలు కార్యక్రమాలకు సంబంధించిన ప్రత్యేక ఫోటో ప్రదర్శన ఏర్పాటు చేశారు. జిల్లాలో అభివృద్ధి చేసిన అర్బన్ ఫారెస్ట్ పార్కుల విశేషాలు, నగర పర్యావరణ పరిరక్షణలో వాటి పాత్రను ఈ ప్రదర్శనలో వివరించారు.. పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన ఎన్జీవో సభ్యులు, స్వచ్ఛంద కార్యకర్తలకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రశంసా పత్రాలు అందజేశారు. అటవీ సంరక్షణ, పచ్చదనం విస్తరణ, అర్బన్ ఫారెస్ట్ పార్కుల అభివృద్ధిలో అటవీ శాఖ చేస్తున్న సేవలను అతిథులు అభినందించారు.. వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొని భావితరాలకు సహజ వనరులను అందించాలంటే ప్రజల భాగస్వామ్యం, సమిష్టి కృషి ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు.. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## దుండిగల్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకలు..!

- కాలుష్య నియంత్రణకు పచ్చదనమే మార్గమని సూచించిన డీసీ..
- దుండిగల్ నర్సరీలో మొక్కలు నాటిన డీసీ డా. ఎస్.వెంకట మణి కరణ్..
- పర్యావరణ పరిరక్షణపై అవగాహనతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని పిలుపు.





దుండిగల్ సర్కిల్ నర్సరీలో మొక్కలు నాటిన డిప్యూటీ కమిషనర్..





**దుండిగల్, పెన్ పవర్, జూన్ 5:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని దుండిగల్ సర్కిల్ పరిధిలోని నర్సరీలో శుక్రవారం మొక్కలు నాటి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటిచెప్పారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడు తమ బాధ్యతగా చేపట్టాలని సూచించారు.. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకం, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.. మొక్కలు మనకు ప్రాణవాయువును అందించడమే కాకుండా వాతావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు కూడా తోడ్పడవచ్చని వివరించారు.. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ విభాగం డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ అశోక్ కుమార్, యూబీడీ రఘువీర్ రెడ్డి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్‌తో పాటు సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు



## పర్యావరణ ప్రతిజ్ఞతో ప్రజల్లో చైతన్యం..

### జనగణన వేగవంతం చేయాలంటూ కుత్బుల్లాపూర్ జెడ్‌సీ ఆదేశం..

- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గాజులరామారంలో మొక్కలు నాటిన జోనల్ కమిషనర్..
- ఎస్‌హెచ్‌జీ మహిళలతో కలిసి పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ..
- గాజులరామారం, దేవేందర్ నగర్ శ్మశాన వాటికల తనిఖీలు..
- కనీస మౌలిక వసతుల కల్పనకు అధికారులకు ఆదేశించిన జెడ్‌సి..
- జూన్ 9లోపు జనగణన పూర్తి చేయాలని ఎన్యూమరేటర్లకు స్పష్టమైన సూచనలు..

-4 లో

# పర్యావరణ ప్రతిజ్ఞతో ప్రజల్లో చైతన్యం

## జనగణన వేగవంతం చేయాలంటూ కుత్బుల్లాపూర్ జెడ్సీ ఆదేశం..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జూన్ 5:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ఐఏఎస్ పి.పింకేష్ కుమార్ శుక్రవారం పలు సర్కిల్‌ల పరిధిలో పర్యటించారు.. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పి.పింకేష్ కుమార్ శుక్రవారం గాజులరామారం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటి, వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఆయన పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో గాజులరామారం డిప్యూటీ కమిషనర్ వెంకట్రాములు, డిప్యూటీ డైరెక్టర్ అర్బన్ బయోడైవర్సిటీ (డీడీ-యూబీడీ), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (డీఈఈలు), మేనేజర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలతో కలిసి జోనల్ కమిషనర్ పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించారు. పర్యటనలో భాగంగా గాజులరామారం, దేవేందర్ నగర్ ప్రాంతాల్లోని శ్మశాన వాటికలను జోనల్ కమిషనర్ తనిఖీ చేశారు. అక్కడి పరిస్థితులను పరిశీలించిన ఆయన, అవసరమైన మేరకు ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టి ప్రజలకు కనీస మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.. అనంతరం హెచ్‌ఎమ్‌టీ సొసైటీ, రోడా మేస్త్రీ నగర్ 'బి' ప్రాంతాల్లో కొనసాగుతున్న జనగణన పనులను పరిశీలించారు. జనగణన ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించిన ఆయన, పనులను మరింత వేగవంతం చేసి ఈ నెల 9వ తేదీ నాటికి పూర్తి చేయాలని అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లకు సూచించారు.. పర్యావరణ పరిరక్షణ, ప్రజా సౌకర్యాల అభివృద్ధి, జనగణన వంటి కీలక కార్యక్రమాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జోనల్ కమిషనర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు..



పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న కుత్బుల్లాపూర్ జెడ్‌సి పింకేష్ కుమార్ ఐఏఎస్..

- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గాజులరామారంలో మొక్కలు నాటిన జోనల్ కమిషనర్..
- ఎస్‌హెచ్‌జీ మహిళలతో కలిసి పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ..
- గాజులరామారం, దేవేందర్ నగర్ శ్మశాన వాటికల తనిఖీలు..
- కనీస మౌలిక వసతుల కల్పనకు అధికారులకు ఆదేశించిన జెడ్‌సి..
- జూన్ 9లోపు జనగణన పూర్తి చేయాలని ఎన్యూమరేటర్లకు స్పష్టమైన సూచనలు..




మొక్కను నాటిన కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేశ్ కుమార్..



# సెన్సస్ పురోగతిపై అధికారులతో సమీక్ష

## దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ అధికారులతో సమావేశం..

**దుండిగల్, పెన్ పవర్, జూన్ 5:** దుండిగల్ సర్కిల్ కార్యాలయాన్ని జోనల్ కమిషనర్ పి.పింకేష్ కుమార్ ఐఏఎస్ శుక్రవారం సందర్శించారు.. సెన్సస్, ఇంజినీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు.. సమావేశంలో సెన్సస్ పురోగతిపై నోడల్ అధికారులు, సూపర్‌వైజర్‌లను అడిగి తెలుసుకున్న జోనల్ కమిషనర్, ఈ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు.. ఫీల్డ్ ఎంక్వయిరీ ద్వారా సేకరించిన వివరాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు.. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంజినీరింగ్ విభాగం పనులపై ప్రత్యేకంగా సమీక్షించారు.. వర్షాల సమయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే టెండర్లు పూర్తయిన అభివృద్ధి పనులు వేగవంతం చేసి, అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.. టౌన్ ప్లానింగ్ విభాగం సమీక్షలో భాగంగా వర్షాకాలంలో ప్రమాదకర పరిస్థితులు తలెత్తకుండా సెల్లార్లను గుర్తించి సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు..

అదేవిధంగా శిథిలావస్థకు చేరుకున్న భవనాలు, ఇళ్లను గుర్తించి ప్రజల భద్రత దృష్ట్యా ప్రాధాన్యత ఇస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.. శానిటేషన్ విభాగానికి సంబంధించి ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని, పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షించి ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అధికారులకు సూచించారు.. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్, డిప్యూటీ ఇంజనీర్లు పాపమ్మ, అన్వేష్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ సురేందర్ నాయక్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.




దుండిగల్ సర్కిల్-59లో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐఏఎస్ సమీక్ష..






- సెన్సస్, వర్షాకాల సన్నద్ధత, పారిశుద్ధ్య పనులపై అధికారులకు ఆదేశాలు..
- వర్షాల దృష్ట్యా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించిన జెడ్‌సి..
- అభివృద్ధి పెండింగ్ పనులు వేగంగా పూర్తి చేయాలని సూచన..
- ప్రమాదకర సెల్లార్లు, శిథిల భవనాల గుర్తింపునకు ఆదేశాలు..
- 99 రోజుల పారిశుద్ధ్య కార్యాచరణను సమర్థంగా అమలు చేయాలని సూచన..

# సింగరేణిలో జరిగిన 1600 కోట్ల భారీ కుంభకోణం పై వెంటనే విచారణ జరపాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాసారు. సింగరేణిలో జరిగిన 1600 కోట్ల భారీ కుంభకోణం పై వెంటనే విచారణ జరపాలని కోరారు. సింగరేణి సంస్థ ప్రకటించిన నిల్వలనుంచి సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు ఎలా మాయమైంది ? తాజాగా 1600 కోట్ల బొగ్గును రేవంత్ రెడ్డి మాయం చేశారు. స్టాక్ యార్డుల్లో ఉండాల్సిన బొగ్గును అప్పనంగా అమ్ముకున్నారు. 1600 కోట్ల విలువ చేసే బొగ్గు ఏమైందో వెంటనే తేల్చాలని కోరారు.
కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి వరుస కుంభకోణాలకు కేరాఫ్ గా మారింది. నైని కుంభకోణం నుంచి మొదలుకొని... వందల అక్రమాల విషయంలో కేంద్రం నుంచి స్పందన లేదు. నిలువలు తనిఖీ చేసే బొగ్గు గనుల శాఖ కానీ...కాగ్ అధికారులు కానీ ఇప్పటిదాకా ఎందుకు తనిఖీలు చేపట్టలేదు. ఈ అంశాన్ని మా పార్టీ లేవనెత్తినా కేంద్రం నుంచి స్పందన లేదు. సింగరేణి బొగ్గు.. తెలంగాణ ప్రజల ఆస్తి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సింగరేణిని మనుగడనే దెబ్బతీస్తున్నాయి. కిషన్ రెడ్డి రేవంత్ రెడ్డి మిలాఖాత్ లేకుంటే వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఒక అఖిల పక్షాన్ని ఆయా గనుల వద్దకు పంపాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాని లేఖలో పేర్కొన్నారు.






# హనుమకొండలో నకిలీ వైద్యుడి క్లినిక్ పై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ దాడి



**హనుమకొండ : పెన్ పవర్:** హనుమకొండ జిల్లా యేనుగులగడ్డ ఇంద్రానగర్‌లో నకిలీ వైద్యుడి క్లినిక్‌పై డీసీఏ అధికారుల దాడి.బత్తుల రాజు కుమార్ అనే వ్యక్తి సరైన అర్హతలు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తింపు.
ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన మందులను స్వాధీనం చేసుకున్న అధికారులు.
మొత్తం 41 రకాల మందులు, అందులో 35 రకాల ఇన్‌స్టిట్యూషనల్ సప్లై మందులు గుర్తింపు.
యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు,నొప్పి నివారణ మందులు,ఐవీ ఫ్లూయిడ్స్, బీపీ మందులు స్వాధీనం.
స్వాధీనం చేసుకున్న మందుల విలువ సుమారు రూ.10,000.క్లినిక్‌లో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్ల వినియోగం ప్రజారోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉందని డీసీఏ హెచ్చరిక. మందుల నమూనాలను సేకరించి విశ్లేషణకు పంపిన అధికారులు.కేసుపై మరింత దర్యాప్తు కొనసాగిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీఏ వెల్లడించింది.లైసెన్స్ లేని వ్యక్తులు, క్వాక్‌లకు మందులు సరఫరా చేసే డీలర్లపై కూడా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిక.

# ఎరువుల అమ్మకాల కు తీసుకువచ్చిన యాప్ ను రద్దు చేయాలి.

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర ప్రభుత్వము ఎరువులు అమ్మకాలకు తీసుకువచ్చిన యాప్ అత్యంత దుర్మార్గంగా ఉందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే మల్లయ్య అన్నారు. దీనిలో పెట్టిన టువంటి నిబంధనల వల్ల రైతులకు కొద్దిపాటి ఎరువులు కూడా దొరకవు అని ఆయన అన్నారు. ఆ ఎరువులు అధికార పక్షము, కూటమి నాయకులకు మాత్రమే తప్ప, సామాన్య ప్రజలకు రైతులకు దొరికే పరిస్థితి లేదని ఆయన ఆవేదన చెందినారు. గతంలో పత్తి కొనుగోలు చేయడానికి సీసీఐ వాళ్లు కపాస్ కిసాన్ యాప్ తీసుకురావడం వల్ల ఆ యాప్ లో పత్తి పండించిన రైతుల పేర్లు నమోదు కాక పత్తి అమ్ముకోలేక చాలామంది రైతులు అవస్థలు పడుతూ ప్రైవేటు దళారులకు పత్తిని అమ్ముకోవడం జరిగిందని ఆయన అన్నారు. అదే విధంగా ఈ యాప్ కూడా రైతులకు ఎరువులు నమోదు కాకపోవడంతో ఎరువులు అందక దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంటుంది. అసలే ధరలు లేక రైతులు సతమతమవుతున్నారు. రైతులకు ఎరువుల కొరత వల్ల దిగుబడులు తగ్గితే మరింత రైతుల జీవితాలు ప్రమాదంలో పడతాయని ఆయన అన్నారు. అందుకు ఎరువుల ఈ యాప్ ను రద్దుచేసి రైతులు అడిగిన ప్రకారం ఎరువులు సప్లై చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు బి హనుమంతు, బి ఈరన్న, నాయకులు నరసన్న, నాగరాజు, వలి తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ ఏడిఏ, ఏఓ, ఏఈఓ లతో: జిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ సమావేశం

**సిద్దిపేట:హైదరాబాద్ పెన్ పవర్:** జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ
ఫార్మసీ రిజిస్ట్రీ రోజు వారి టార్గెట్ పెట్టుకుని పూర్తి చెయ్యాలని ఏఈ ఓలను, ఫార్మసీ రిజిస్ట్రీ మానిటర్ చెయ్యాలని ఏఓ, ఏడి ఏ లను ఆదేశించారు. ఫార్మసీ రిజిస్ట్రీ వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పలు పథకాలు రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు.ఏఓ పరిధిలోనీ సీడ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో 50 శాతం సన్న వడ్లు అమ్మేలాగా చూడాలని సన్న వడ్లను పెద్ద ఎత్తున ప్రమోట్ చెయ్యాలని ఆదేశించారు. గ్రామ సభలో రైతు సభలో సన్న వడ్లు పండించేందుకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిలా రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు.ప్రతి సారి వరి సాగు ఒక్కటే పండించడం ద్వారా భూమి సారం తగ్గుతుందని పంట మార్పిడి వైపు ప్రతి రైతు ఆలోచన చెయ్యాలని, వాణిజ్య పంటలు, చిరు ధాన్యాలు, ఆయిల్ ఫామ్ సాగు వైపు రైతులను ప్రేరేపించాలని, తద్వారా రైతులు లాభం పొందడమే కాకుండా భూమి సారవంతంగా ఉంటుందని తెలిపారు.
54తీగలకుంటపల్లి గ్రామం లో పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని గ్రామసభ నిర్వహించిన సర్పంచ్ మ్యాకల స్వర్ణలతసిద్దిపేట జిల్లా కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామం లో పర్యావరణ దినోత్సవ సందర్భంగా గ్రామ సర్పంచ్ మ్యాకల స్వర్ణలత-సురేందర్ రెడ్డి గ్రామంలో లో ప్రాథమిక పాఠశాలలో మెక్కలు నాటారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగించాలని అన్నారు మరియు సోమారపల్లి లో ఉపాధి హామీ కార్మికులకు మోతుక విస్తరులు కుటడం అవగాహన కల్పించారు. ప్రతిరోజూ గ్రామంలోని పర్యావరణాన్ని కాపాడుతూ గ్రామాన్ని శుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ కార్మికులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భుక్య శారద రాథోడ్, ఉపసర్పంచ్ రాగుల మహేష్, వార్డ్ మెంబర్స్ జాలిగా మనిషా సంపత్, దయ్యాల స్వప్న మహేందర్, పెరుగు సంజీవరెడ్డి,రేవోజు శంకర్,నక్క పరమేశ్వర్ రెడ్డి, మహిళా సంఘం అధ్యక్షురాలు కొమ్మిడి శారద, శనిగరం పద్మ,అంగన్వాడి టీచర్ దానబోయిన సమ్మవ్వ,ఆశా వర్కర్స్ వేల్పుల పుష్ప,రేవోజు లావణ్య, కరోబార్ మెట్టు వెంకటరెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పుప్పాలగూడలో హైడ్రా భారీ ఆపరేషన్

**హైదరాబాద్ పెన్ పవర్:**
ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజు హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. ప్రకృతిని పరిరక్షిస్తూ చారిత్ర రాళ్ల గుట్టలతో పాటు.. అతి పురాతన రాతి గుహలు, వాటి మధ్యన ఉన్న చెట్టూ.., చేమను హైడ్రా కాపాడింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ - ఖాజాగూడ సరిహద్దుల్లో శుక్రవారం 198 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. ఇందులో 250 కోట్ల సంవత్సరాల చారిత్రక రాళ్ల గుట్టలు కూడా ఉన్నాయి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ ఎం డీ ఏకు కేటాయించిన 200ల ఎకరాలు కూడా ఉన్నాయి. చారిత్రక గుట్టలను కాపాడాలని కోరుతూ దశాబ్దాలుగా సొసైటీ టూ సేవ్ రాక్స్ ప్రతినిధులు పోరాడుతున్నారు. హైకోర్టును కూడా వీరు ఆశ్రయించారు. ఈ మేరకు రాతి గుట్టలతో పాటు.. ప్రభుత్వ భూమిని కాపాడాలని 2019లో మున్సిపల్, రెవెన్యూ శాఖలకు హైకోర్టు ఆదేశించింది. హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడం జాప్యం కావడంతో కబ్జాలకు ఆస్కారం ఇచ్చినట్టయ్యింది. ఇదే విషయాన్ని సొసైటీ టూ సేవ్ రాక్స్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయిలో గతంలోనే పరిశీలించారు. రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకుని శుక్రవారం ఫెన్సింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ భూమి విలువ రూ. 30వేల కోట్లు వరకూ ఉంటుందని అంచనా.

**రెవెన్యూ రికారక్డుల మేరకు..**

సర్వే నంబరు 452/1 లో 174 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అలాగే 454/1 సర్వే నంబరులో 119.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మొత్తం 293.05 ఎకరాలు కాగా.. ఇందులో 263.05 ఎకరాలను గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ ఎండీఏకు కేటాయించింది. రెండు గ్రామాల మధ్య ఓవర్‌ల్యాప్ ఇష్యూలతో 63.05 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా రెవెన్యూ అధికారులు గుర్తించారు. దీంతో హెచ్ ఎం డీఏకు 200ల ఎకరాలు మాత్రమే మిగిలాయి. ఇవే చారిత్రక గుట్టల ప్రాంతంలో వివిధ దేవాలయాలకు 5 ఎకరాలు కేటాయించగా.. దర్గాకు 5 ఎకరాలు అప్పజెప్పినట్టు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. ఇలా ఎవరికి కేటాయించిన భూములు పోగా.. 200 ఎకరాల హెచ్ ఎం డీ ఏ భూమిని హైడ్రా శుక్రవారం కాపాడింది. సొసైటీ టూ సేవ్ రాక్స్ ప్రతినిధులు కోరిన విధంగా అక్కడ చారిత్రక బండ రాళ్లను కూడా హైడ్రా కాపాడినట్టయ్యింది. మంచి వ్యూ పాయింట్‌తో ..ఎంతో ఎత్తుగా.. సహజ సిద్ధంగా ఉన్న గుట్టలను, 250 కోట్ల సంవత్సరాల చరిత్ర గల కొండలను కాపాడి ప్రకృతిని పరిరక్షించారంటూ రాక్ సొసైటీ ప్రతినిధులు హైడ్రాను కొనియాడారు. రాళ్ల గుట్టలతో పాటు పలు ఆలయాలున్న చారిత్రక స్థలంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా కాపాడిన హైడ్రా కు ప్రజలతో పాటు భక్తులు, పర్యావరణ ప్రేమికులు అభినందనలు తెలిపారు. దశాబ్దాల సమస్యను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం చూపిన చొరవను అభినందించారు. ఈ గుట్టలను ఆనుకుని ఉన్న భగీరథమ్మ చెరువును కూడా హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఒక పక్క ఎత్తైన కొండ.. దిగువ భాగంలో ఉన్న భగీరథమ్మ చెరువు సిద్ధమైతే.. ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతుందని పలువురు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# మొబైల్ రీఛార్జ్‌పై మళ్లీ భారం..? త్వరలో టారిఫ్ల పెంపుకు సంకేతాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**
దేశంలోని కోట్లాది మొబైల్ వినియోగదారులకు మరోసారి షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పెరిగిన రీఛార్జ్ ధరలతో ఇబ్బందులు పడుతున్న వినియోగదారులకు, మరోసారి టెలికాం టారిఫ్లు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. వచ్చే 3 నుంచి 6 నెలల్లో మొబైల్ రీఛార్జ్ టారిఫ్లు సుమారు 10 శాతం మేర పెరిగే అవకాశం ఉందని యాక్సిస్ క్యాపిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గౌరవ్ మల్హోత్రా అభిప్రాయపడ్డారు.సీఎన్బీసీ-టీవీ18కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, గతంలో జరిగినట్లుగా 15 నుంచి 20 శాతం భారీ పెంపులు ఈసారి అవసరం లేదని, కానీ టెలికాం సంస్థల ఆదాయాన్ని పెంచేందుకు పరిమిత స్థాయిలో ధరల సవరణ జరిగే అవకాశం ఉందని తెలిపారు.ప్రస్తుతం దేశంలో ప్రధాన టెలికాం కంపెనీలు అయిన తమ సేవల నాణ్యత, 5+ విస్తరణ, నెట్వర్క్ నిర్వహణ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని టారిఫ్లను పునఃసమీక్షిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.
గత ఏడాది కూడా టెలికాం సంస్థలు రీఛార్జ్ ప్లాన్ల ధరలను పెంచడంతో సాధారణ వినియోగదారులపై అదనపు భారం పడింది. ముఖ్యంగా రోజువారీ డేటా వాడే విద్యార్థులు, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు ఎక్కువగా ప్రభావితమయ్యారు. ఇప్పుడు మరోసారి ధరల పెంపు జరిగితే నెలవారీ మొబైల్ ఖర్చు మరింత పెరిగే అవకాశం ఉందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ పెంపు అన్ని ప్లాన్లపై సమానంగా ఉండకపోవచ్చని, ముఖ్యంగా అధిక డేటా వినియోగ ప్లాన్లు, అన్లిమిటెడ్ కాలింగ్ ప్యాకేజీలపై ఎక్కువ ప్రభావం ఉండే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు.
ఇప్పటివరకు టెలికాం కంపెనీల నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, రాబోయే నెలల్లో మొబైల్ రీఛార్జ్ ఖర్చులు పెరిగే అవకాశాన్ని వినియోగదారులు ముందుగానే అంచనా వేసుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది

# సరైన అనుమతులు లేని బిఈడి కళాశాలల అఫిలియోషన్ ను రద్దు చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఎమ్మిగనూరు పట్టణంలో సరైన అనుమతులు లేని బి ఈ డి కళాశాలలా అఫ్లియేషన్ ను రద్దు చేయాలని ఆర్ పి ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ ఆఫ్రిది డిమాండ్ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ అనుబంధంగా ఎమ్మిగనూరు పట్టణంలో నాలుగు బిఈడి కాలేజీలు ఉన్నాయని వాటిలో కొన్ని కాలేజీలో అర్హతలు లేని వారిని ప్రిన్సిపాల్ గా మరియు లెక్చరర్స్ గా వీధులు నిర్వహిస్తున్నారని అంతేకాకుండా వేరే రాష్ట్రాల నుంచి బిఈడి అడ్మిషన్లు చేసుకుంటూ లక్షల కూడగట్టుకుంటున్నారని, వారు కళాశాలకు రాకపోయినా లేదా బీఈడీ బ్లాక్ టీచింగ్ మరియు ప్రాక్టికల్స్ కు రాకపోయినా వారి నుంచి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేసుకుంటున్నారని ఇంత జరుగుతున్నా కూడా యూనివర్సిటీ అధికారులు బీఈడీ కళాశాల యాజమాన్యం ఇచ్చే ముడుపులు తీసుకుని వారికే మద్దతుస్తున్నారని తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదు.ఇప్పుడు బి ఈ డి కాలేజీల ఆఫిలియెషన్ కూడా ఆ ముడుపులు తీసుకున్న యూనివర్సిటీ అధికారులే వస్తున్నారని ఒకవేళ అలాగే జరిగితే ఖచ్చితంగా ఆర్ పి ఎస్ ఎఫ్ విద్యార్థి సంఘం గా అడ్డుకుంటామని
వారు హెచ్చరించారు ఇప్పటికైనా రాయలసీమ యూనివర్సిటీ అధికారులు స్పందించి సరైన అనుమతులు లేని బీఈడీ కళాశాలపై అలాగే వారికి వత్తాసు పలికిన రాయలసీమ యూనివర్సిటీ అధికారులు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారికి మరియు గవర్నర్ గారికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం నాయకులు మహబూబ్, నర్సింహా నాయుడు, షైక్ష వలి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు

# పపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. "ప్రకృతి మనకు జీవనాధారం, స్ఫూర్తి, భవిష్యత్తుకు మార్గదర్శకం. నేడు వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి" అని ఒక సందేశంలో పేర్కొన్నారు. ఒక మొక్క నాటడం, నీటిని ఆదా చేయడం, కాలుష్యాన్ని తగ్గించడం వంటి చిన్నచిన్న చర్యలే రేపటి తరాలకు సురక్షితమైన, స్వచ్ఛమైన భూమిని అందించగలవని పేర్కొన్నారు. కాలుష్య ఉద్గారాలను తగ్గించేందుకు విద్యుత్ వాహన వినియోగం, గ్రీన్ ఎనర్జీ దిశగా సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడం, అర్బన్ పార్కులు, చెరువుల పునరుద్ధరణతో హైదరాబాద్ నగరాన్ని నెట్-జీరో సిటీగా మార్చే లక్ష్యాలతో ప్రజా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు

# హనుమకొండలో నకిలీ వైద్యుడి క్లినిక్పై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ దాడి

**హనుమకొండ: పెన్ పవర్:** హనుమకొండ జిల్లా యేనుగులగడ్డ ఇంద్రానగర్లో నకిలీ వైద్యుడి క్లినిక్పై డీసీఏ అధికారులు దాడి జరిపారు. బత్తుల రాజు కుమార్ అనే వ్యక్తి సరైన అర్హతలు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించారు. ఫస్ట్ ఎయిడ్ క్లినిక్లో అక్రమంగా నిల్వ ఉంచిన మందులను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 41 రకాల మందులు, అందులో 35 రకాల ఇన్స్టిట్యూషనల్ సప్లై మందులు గుర్తింపులున్నాయి. యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, నొప్పి నివారణ మందులు, ఐవీ ఫ్లూయిడ్స్, బీపీ మందులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మందుల విలువ సుమారు రూ.10,000. వుంటుంది. క్లినిక్లో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్ల వినియోగం ప్రజారోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉందని డీసీఏ హెచ్చరించింది. మందుల నమూనాలను సేకరించి విశ్లేషణకు పంపారు. కేసుపై మరింత దర్యాప్తు కొనసాగిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీఏ వెల్లడించింది. లైసెన్స్ లేని వ్యక్తులు, క్వాక్లకు మందులు సరఫరా చేసే డీలర్లపై కూడా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది.

# మంచిర్యాల: వడదెబ్బతో జూనియర్ ఇన్‌స్పెక్టర్ మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:**
వడదెబ్బతో జూనియర్ ఇన్‌స్పెక్టర్ మృతి
మందమర్రి ఏరియా ఎస్ అండ్ పీసీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన జూనియర్ ఇన్‌స్పెక్టర్ బఠారి చంద్రమౌళి (55) వడదెబ్బతో మరణించారు. బుధవారం రాత్రి ఆయనకు తీవ్ర ఆయాసం రావడంతో మొదట డిస్పెన్సరీకి, ఆపై మెరుగైన చికిత్స కోసం రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచినట్లు ఉద్యోగులు తెలిపారు. ఈ ఘటనతో డిపార్ట్‌మెంట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

# మిర్యాలగూడలో పెను విషాదం.. సిలిండర్ పేలి ముగ్గురి మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** : మిర్యాలగూడలో పెను విషాదం చోటుచేసుకుంది.ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ముగ్గురు కుటుంబసభ్యులు సజీవ దహనం అయ్యారు.
అమ్మమ్మ, మనవడు, మనవరాలు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కలాల్‌వాడకు చెందిన చంద్రకళ, సైదులు భార్యాభర్తలు.సైదులు అనారోగ్యం కారణంగా నెలరోజుల క్రితం చనిపోయాడు. చంద్రకళ పెద్ద కూతురు ధనమ్మ భర్త పదేళ్ల క్రితం చనిపోయాడు. దీంతో ధనమ్మ తన ఇద్దరు పిల్లలు లక్ష్మణ్(16), ప్రణతి(14)తో పుట్టింట్లోనే ఉంటోంది.మూడు రోజుల క్రితం ఇళ్లలో పని చేసేందుకు పుణె వెళ్లింది. గురువారం రాత్రి చంద్రకళ.. మనవడు, మనవరాలితో ఇంట్లో నిద్రిస్తుండగా షార్ట్ సర్క్యూట్ అయింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్న నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ముగ్గురూ మంటల్లో చిక్కుకుని సజీవ దహనం అయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయకచర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. పోలీసులు మూడు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు..

# గ్రేటర్ ఎన్నికల్లో కూటమి..?

**హైదరాబాద్, జూన్ 5, పెన్ పవర్:** తెలంగాణలో కొన్ని రోజులుగా పవన్ కల్యాణ్ చుట్టూ రాజకీయాలు నడుస్తున్నాయి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు జనసేన తెలంగాణ రాష్ట్ర శాఖ నవ నిర్మాణ సభ ఏర్పాటు చేసింది. దానికి పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ను ఆహ్వానించింది. అయితే అంతకుముందే నాగేశ్వర్ ఇష్యూ నడుస్తూ ఉండడం, ఇరు పక్షాల మధ్య వాదోపవాదనలు బలంగా నడుస్తూ ఉండడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సభకు పర్మిషన్ ఇవ్వలేదు. అటు హైకోర్టు కూడా ఈ సమావేశానికి అనుమతి నిరాకరించింది.అదే రోజు పవన్ కల్యాణ్ తన ఇంట్లో ప్రెస్ మీట్ పెట్టి ఆవేశంగా మాట్లాడారు. తనను తెలంగాణలో అడుగుపెట్టనివ్వబోమని హెచ్చరిస్తున్నారని, ఇదేమైనా వాళ్ల అయ్య జాగీరా అని ప్రశ్నించారు. ఇన్నాళ్లూ తెలంగాణపై దృష్టి పెట్టాలనే ఆలోచన రాలేదని, కానీ తెలంగాణలో కూడా పోటీ చేయాలని ఇప్పుడునిర్ణయించుకున్నానని ప్రకటించారు. ఈ ప్రకటన తెలంగాణ రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది.పవన్ కల్యాణ్ తెలంగాణపై ఫోకస్ చేయడం వెనుక కాంగ్రెస్ హస్తం ఉందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది.రేవంత్ రెడ్డి కోసమే పవన్ కల్యాణ్ ఇలా పని చేస్తున్నారని చెప్తోంది. అయితే పవన్ కల్యాణ్ పై యుద్ధ భేరి మోగించారు కాంగ్రెస్ నేతలు. బీఆర్ఎస్ కంటే ఎక్కువగా కాంగ్రెస్ నేతలే పవన్ కల్యాణ్ పై నోరుపారేసుకుంటున్నారు. జనసైనికుల్లో ఆగ్రహం రావడానికి కాంగ్రెస్ నేతల మాటలే కారణం.అయితే రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీకి లబ్ది చేకూర్చేందుకే పవన్ కల్యాణ్ ఎంట్రీ ఇస్తున్నారని కొంతమందిఅంచనా వేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సీమాంధ్ర ఓటర్లు పెద్ద ఎత్తున ఉన్నారు. ఇన్నాళ్లూ వాళ్లంతా బీఆర్ఎస్ వైపు నడిచారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి వాళ్ల ఓట్లను రాబట్టుకునేందుకు గట్టిగా ట్రై చేస్తున్నారు. అందులో భాగంగానే ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కూడా చేశారు. అయితే సీమాంధ్ర ఓట్లను పవన్ కల్యాణ్ చీల్చ గలిగితే బీఆర్ఎస్ ఎక్కువగా నష్టపోతుందని అంచనా వేస్తున్నారు.

ఆ ఓట్లు పవన్కల్యాణ్ పార్టీ లాక్కోగలిగితే, అంతిమంగా అది బీజేపీకి మేలు చేసే అవకాశం ఉండొచ్చని భావిస్తున్నారుబీజేపీ ఇప్పటికే తాము ఒంటరిగానే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బరిలోకి దిగుతామని ప్రకటించింది. ఒకవేళజనసేన, టీడీపీ కలిసి పోటీ చేస్తే సీమాంధ్ర ఓటర్లు పెద్దఎత్తున ఆ కూటమి వైపు మళ్లొచ్చు. అప్పుడు బీఆర్ఎస్ ఎక్కువ నష్టపోతుంది. కాంగ్రెస్ కొంతమేర కోల్పోవచ్చు. ఈ చీలికలో బీజేపీకి లబ్దిచేకూరవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బీజేపీకి లబ్ది చేకూర్చేందుకే పవన్ కల్యాణ్ తెలంగాణపై కన్నేశారని భావిస్తున్నారు.

# ఉప్పల్ అభివృద్ధికి మరో మైలురాయి..

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉప్పల్ భగాయత్ లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) నూతన భవన నిర్మాణానికి జూన్ 7న భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ఉప్పల్ భగాయత్లో నిర్మించనున్న నూతన భవన స్థలాన్ని వారు పరిశీలించి మీడియా సమావేశంలో మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఉప్పల్ నియోజకవర్గంలో సుమారు రూ.1,000 కోట్ల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.గత పదేళ్లలో జరగని అభివృద్ధి గత మూడు సంవత్సరాల్లో జరిగిందని పేర్కొన్నారు.మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలోనే రేవంత్ రెడ్డికి ఈ ప్రాంత సమస్యలు, అవసరాలపై పూర్తి అవగాహన ఉందని, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉప్పల్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు.

ఉప్పల్ ప్రాంత అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఎంఎంసీ నూతన భవనం నిర్మాణంతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు పరిపాలనా సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు.జూన్ 7న జరిగే భూమిపూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాజ్య సభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అయన పిలుపునిచ్చారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శిశు మందిర్ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ పంపిణీ

**కరీంనగర్ పెన్ పవర్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా విద్యార్థులు పండ్ల మొక్కలను నాటి, స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టి, పర్యావరణ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆచార్యులు విద్యార్థులకు సూచించారు.

"ఒక్క విద్యార్థి -- ఒక్క మొక్క" అనే నినాదంతో స్థానిక అంబేద్కర్ స్టేడియంలో సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో ఈ సీడ్ బాల్స్ను ఖాళీ ప్రదేశాల్లో వేయడం ద్వారా పచ్చదనం పెంపొందించవచ్చని, ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రధాన అంశం "క్లైమేట్ ఆక్షన్ –నౌ ఫర్ క్లైమేట్ " అని పేర్కొంటూ, భూమిని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, పర్యావరణ పరిరక్షణను వ్యక్తిగత బాధ్యతగా భావించి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ పిలుపునిచ్చారు.



ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, డీవైఎస్వో ఉట్కూరు శ్రీనివాస్ గౌడ్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వెల్దండి దామోదర్, బైరి శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, సంపత్, సూర శివశంకర్, నాగరాజు, పాఠశాల కమిటీ సభ్యులు కొత్తూరి ముకుందం, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, డాక్టర్ నాళ్ల సత్య విద్యాసాగర్, పులాల శ్యామ్, తాటి రాజేశ్వర్రావు, రాపర్తి శ్రీనివాస్, నడిపెల్లి దీన్దయాల్, అప్పిడి వకులదేవి, ఆచార్య బృందం, విద్యార్థులు మరియు పలువురు పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అర్బన్ ఆక్సిజన్ పార్క్ లో మొక్కలు నాటిన మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట పెన్ పవర్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అర్బన్ ఆక్సిజన్ పార్క్ లో మంత్రి పొన్నం ప్రభాకర్

మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు,జిల్లా కలెక్టర్ కె.హైమావతి,సిపి రష్మీ పెరుమాళ్,అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్, డిఎఫ్ఓ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ధరిపల్లి చంద్రం,పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.... .పర్యావరణాన్ని పరిరక్షించడానికి చెట్టు విలువ తెలుసా అనే పోస్టర్ ఆవిష్కరించారు.

మంత్రి పొన్నం మాట్లాడుతూప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం లాంచనంగా ప్రారంభించాం.ప్రపంచమే కుగ్రామంగా మారుతున్న వేళ పర్యావరణాన్ని కాపాడడానికి మొక్కలు నాటాలిమొక్కలు నాటడం కార్యక్రమంగా కాదు మన జీవితంలో భాగస్వామ్యం కావాలి.హుస్నాబాద్ నియోజకవర్గం లో 280 మహిళా సంఘాలకు 13 రకాల వస్తువులు గవర్నర్ గారి చేత మీద స్టీల్ బ్యాంక్ పంపిణీ చేశాం.500 హోటల్స్ కి గ్లాస్ లు పంపిణీ చేశాం హుస్నాబాద్ మున్సిపాలిటీ,సూర్యాపేట తో కలిసి అవార్డు తీసుకుంటుంది

దిల్లీలో కాలుష్యంతో నివసించే పరిస్థితి లేదు.




తెలంగాణ లో అలాంటి పరిస్తితి రాకుండా ముఖ్యమంత్రి ఈవి పాలసీ తీసుకొచ్చారు.దేశంలో ఎక్కడ లేని విధంగా సున్నా టాక్స్ అమలు చేస్తున్నాం.

మొక్కలు నాటడానికి అన్ని గ్రామాల్లో ఐదుగురు సభ్యులతో కమిటీ వేశాంప్రజలందరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి.ఈ కార్యక్రమంలో కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మీ పెరుమాళ్, జిల్లా అటవీ శాఖ అధికారి సంధ్యారాణి, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీ కిరణ్, అదనపు డిసిపి సుభాష్ చంద్రబోస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపెల్లి చంద్రం, స్థానిక సర్పంచ్ బాలరాజు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి రవీందర్, జిల్లా అధికారులు, సిబ్బంది, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడలో ఘోర ప్రమాదం..

## షార్ట్ సర్క్యూట్ తో సిలిండర్ పేలి ముగ్గురు మృతి

**మిర్యాలగూడ: పెన్ పవర్:** మిర్యాలగూడలో విషాదం నెలకొంది. షార్ట్ సర్క్యూట్ తో సిలిండర్ పేలి ముగ్గురు మృతి చెందారు. కలాల్వాడలో ఇంట్లో నిద్రిస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలింది. మృతులు అమ్మమ్మ చంద్రమ్మ(50), మనవడు లక్ష్మణ్(17),మనవరాలు ప్రణతి(14). ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసారుఉ. మూడు మృతదేహాలు గుర్తించారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వన్ టౌన్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో బిటెక్ విద్యార్థి మృతి

**సికింద్రాబాద్: పెన్ పవర్:** జలమండలి కార్యాలయం వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కింద పడి బీటెక్ విద్యార్థి మృతి చెందాడు.జూబ్లీ బస్ స్టేషన్ నుండి ఉప్పల్ కు వెళ్తున్న క్రమంలో ఘటన చోటుచేసుకుంది.గురునానక్ కళాశాలలో బీటెక్ చదువుతున్న విశాల్ మదన్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో కొద్దిపాటి వర్షానికి రహదారి తడవడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బస్సు కిందికి వెళ్లడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన విశాల్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గోపాలపురం ట్రాఫిక్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని అంబులెన్స్ లో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## సైకిలింగ్ అనేది జీవన విధానం కావాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**

పచ్చదనం, పర్యావరణానికి ఏయూ క్యాంపస్ ఆదర్శంగా మారాలి. నెట్ జీరో క్యాంపస్ గా ఏయూను తీర్చిదిద్దాలని ఆదేశించాను. ఎంతో విశిష్టమైన ప్రముఖులను ఏయూ తయారు చేసింది. ఎండలు విపరీతంగా పెరిగాయి.. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. ఓవైపు విపరీతమైన ఎండలు.. లేకుంటే తుఫానులు వస్తున్నాయి. సోలార్ ఎనర్జీ ఉత్పత్తి చేసుకోవాలి... ఏయూకు 450 ఎకరాల ల్యాండ్ ఉంది.ఖాళీ ప్రదేశాల్లో చెట్లు పెట్టాలి... బిల్డింగులపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు.

శుక్రవారం అయన ఏయూ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు.

చంద్రబాబు మాట్లాడుతూ క్యాంపస్కు అవసరమైన విద్యుత్ సోలార్ ద్వారానే వచ్చేలా చూడాలి. తిరుమలలో 89.5 శాతం గ్రీనరీ ఉంది. ఏయూ క్యాంపస్ బయో డైవర్సిటీ పార్కుగా రూపాంతరం చెందాలి. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ చేపట్టాలి. వేస్ట్ నుంచి బయో గ్యాస్ ఉత్పత్తి చేసేలా చూడాలి. స్వచ్ఛ పథం కింద రీ-సైక్లింగ్కు పంపాలి. వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లను వినియోగించుకోవాలి. వేస్ట్ వాటర్ మేనేజ్మెంట్ చేపట్టాలి. పీఎన్జీ, ఎలక్ట్రికల్ స్టవ్స్ ను వంటలకు వినియోగించుకోవాలి. నెట్ జీరో విధానం అమలు చేయడానికి ప్రొఫెసర్స్ టీం ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు ఏయూ క్యాంపస్ ఓ నాలెడ్జ్ హబ్ గా తయారు కావాలని అన్నారు.

నెట్ జీరో విధానం అమలు విషయంలో అన్ని విద్యా సంస్థలను గైడ్ చేసేలా ఏయూ అభివృద్ధి చేయాలి. యూనివర్శిటీ అభివృద్ధికి బ్లూ ప్రింట్ తయారు చేస్తున్నాం. యూనివర్శిటీ అభివృద్ధికి విద్యార్థులు భాగస్వాములుగా ఉండాలి. ఇవాళ పర్యావరణ దినోత్సవం.. ప్రజలకు అవగాహన పెంచేందుకు నేను సైకిల్ మీదే ప్రయాణిస్తాను.సైకిలింగ్ అనేది జీవన విధానం కావాలి. విశాఖలో ప్రత్యేకంగా సైకిలింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నాం. 5 కోట్ల సీడ్ బాల్స్తో గ్రీనరీ పెంచేలా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారు. విశాఖలో 50 శాతం గ్రీనరీ పెంచేలా చర్యలు చేపడతున్నాం. విశాఖలో కాలుష్యాన్ని తగ్గించేందుకు పోర్టు దగ్గర నుంచి అన్ని వ్యవస్థల్లోనూ చర్యలు తీసుకుంటామని అన్నారు.

## సైకిల్ తొక్కిన మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

**హైదరాబాద్ పెన్ పవర్:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సైకిల్ తొక్కారు. సీఎం చంద్రబాబు పిలుపు మేరకు సైకిల్ తొక్కుతూ ఈ-సైకిళ్ల వాడకంపై అవగాహన కల్పించారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు సైకిల్ వాడకం పెంచాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యం, పర్యావరణం రెండూ బాగుంటాయని అన్నారు. సైకిల్ ర్యాలీ అనంతరం గొల్లపూడిలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. పర్యావరణ పరిరక్షణ భావి తరాలకు మనం ఇచ్చే కానుక అనన్నారు. పర్యావరణ దినోత్సవం ఒక్క రోజుకే పరిమితం కాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాంధీ ఆసుపత్రిలో డాక్టర్ల అందోళన

**హైదరాబాద్ పెన్ పవర్:**

రాష్ట్రంలో జరుగుతున్న వైద్యుల బదిలీలు ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 38 నిబంధనలకు అనుగుణంగా జరగడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తు గాంధీ హాస్పిటల్ లో ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. వైద్యులు, నర్సుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, బదిలీల ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటిస్తూ జీవో 38లో పేర్కొన్న అన్ని నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా స్పౌస్ (భార్యాభర్తలు ఒకే ప్రాంతంలో లేదా సమీప ప్రాంతంలో పనిచేసే అవకాశం కల్పించే) ప్రమాణాలను, అలాగే ఇతర ప్రాధాన్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా, వైద్యులు సమర్పించిన రిక్వెస్ట్ బదిలీలను తక్షణమే మంజూరు చేయాలని, గుర్తింపు పొందిన తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులకు బదిలీల నుంచి మినహాయింపు కల్పించాలని కోరారు. తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ కేంద్ర సంఘం కార్యవర్గం కూడా ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. జీవో నెం. 38 నిబంధనలను పూర్తిగా అమలు చేసే వరకు సంఘం రాష్ట్ర కార్యవర్గ పదాధికారులు ఎవరూ బదిలీలకు సంబంధించిన ఆప్షన్ ఫారాలను సమర్పించబోరని స్పష్టం చేశారు. ప్రభుత్వం జీవో 38ను పూర్తిగా అమలు చేయకపోతే మరియు వైద్యుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే, తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేయవలసి వస్తుందని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా వైద్య సేవలను నిలిపివేయడానికి కూడా వెనుకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## అందరూ నీటిని ఆదా చేయాలి ప్లాస్టిక్ ను నియంత్రించాలి.

**హైదరాబాద్ పెన్ పవర్:** :ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణకాంత్ పార్క్ లో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం నాడు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ,హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా, జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గోన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా 12 రోజులు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో నాకు సంబంధం లేదు అని ఎవ్వరు అనుకోవద్దు. అశోక చక్రవర్తి ఆనాడు మొక్కలు నాటారు ఈరోజు కూడా మనము అది జ్ఞాపకం చేసుకుంటామని అన్నారు.

భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని ప్రతీ ఒక్కరు విధిగా మొక్కను నాటాలని కోరుతున్నా. ఢిల్లీ కాలుష్యపు కోరల్లో చిక్కుకుంది. హైద్రాబాద్ లో అలాంటి పరిస్థితి రావొద్దు అని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈవీ వాహనాలు వాడకం వల్ల పొల్యూషన్ తగించి పర్యావరణాన్ని కాపాడొచ్చు. రెండు వేల మొక్కలు ఈరోజు నాటే కార్యక్రమం జరుగుతుంది. భవిష్యత్ లో వర్షాలు రాకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుంది..అందరూ నీటిని ఆదా చేయాలి. బోర్లు వేస్తే నీరు వచ్చే పరిస్థితులు లేవు. ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి ఇంట్లో చెట్లు నాటుకోవాలి. ప్లాస్టిక్ ను నియంత్రించాలి. భూమిలో కలిసి పోయే వ్యర్థలను వాడితే మంచిది. నా నియోజకవర్గంలో హోటల్ లలో కూడా స్టీల్ గ్లాస్ లు వాడే విధంగా చర్యలు తీసుకున్నాను. నేను కూడా స్టీల్ గ్లాస్ వాడతాను. ప్లాస్టిక్ వాడొద్దు అని ప్రతిఒక్కరు సామాజిక బాధ్యతగా తీసుకోవాలి. కుటుంబంలో ఆస్తులు భవిష్యత్ తరాలకు ఇస్తారు..సమాజానికి ఏమి ఇచ్చావు అంటే మంచి నేచర్ ఇచ్చాము అని చెప్పగలగాలి. ఈ ప్రాంతంలో డంప్ యార్డ్ సమస్య నా దృష్టికి తీసుకువచ్చారు. ప్లాస్టిక్ వాడకం వల్లే ఈ డంప్ యార్డ్ సమస్యలు వస్తున్నాయి. ప్లాస్టిక్ వాడము అని ప్రతి ఒక్కరు ప్రమాణం చేసుకోవాలని అన్నారు. .

## ఎయిర్ పోర్టు తరహాలో రైల్వేస్టేషన్

**హైదరాబాద్, జూన్ 5 పెన్ పవర్:** ప్రయాణికులకు ఆకర్షణీయమైన, సకల సౌకర్యాలతో కూడిన ప్రయాణ అనుభూతిని అందించేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రపంచస్థాయి ప్రమాణాలతో రెడీ అవుతోంది. దక్షిణ మధ్య రైల్వే అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పునరాభివృద్ధి పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. ఈ మెగా ప్రాజెక్టుకు సంబంధించిన తాజా పురోగతి ఫోటోలు, వివరాలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి బుధవారం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కేవలం ఒక రవాణా కేంద్రంగానే కాకుండా.. భవిష్యత్ అవసరాలను తీర్చే ఒక భారీ అంతర్జాతీయ హబ్‌గా మారుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు.ఈ ఆధునిక రైల్వే గేట్‌వే తెలంగాణ ప్రగతికి ప్రతిరూపమన్నారు. ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పించాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పంలో భాగమే ఈ సికింద్రాబాద్ స్టేషన్ మేకోవర్ అని చెప్పారు. స్టేషన్ పునరాభివృద్ధి ప్రాజెక్టును మొత్తం రూ.714.73 కోట్ల భారీ వ్యయంతో నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాత్రింబవళ్లు జరుగుతున్న ఈ పనులు ప్రస్తుతం 64 శాతానికి పైగా పూర్తయ్యాయని చెప్పారు. ప్రయాణికుల రాకపోకలకు వీలుగా విశాలమైన ప్రవేశ ద్వారాలు, సరికొత్త వెయిటింగ్ హాళ్లు రూపుదిద్దుకున్నాయి. రైళ్ల కోసం వేచి ఉండే ప్రయాణికులకు ఎయిర్‌పోర్టు తరహా అనుభూతిని ఇచ్చేలా అత్యాధునిక ఎయిర్‌కాన్‌కోర్స్ నిర్మాణం చివరి దశకు చేరుకుంది.స్టేషన్‌ను ఆధునికీకరించే క్రమంలో ప్రయాణికుల సౌకర్యార్థం కింది ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగుల ప్రయాణం సులభతరం చేసేందుకు స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లను ఏర్పాటు చేస్తున్నారు. వాహనదారుల పార్కింగ్ ఇబ్బందులను శాశ్వతంగా తొలగించేందుకు అధునాతన మల్టీలెవెల్ కార్ పార్కింగ్ వ్యవస్థను సిద్ధం చేస్తున్నారు. రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణికులు నేరుగా మెట్రో స్టేషన్‌కు చేరుకునేలా అత్యాధునిక స్కైవాక్‌ల నిర్మాణం జోరుగా సాగుతోంది. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్టేషన్ ప్రాంగణంలో భారీగా ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికుల రక్షణ కోసం స్టేషన్

**అంతటా అధునాతన హై-డెఫినిషన్ సీసీటీవీ కెమెరాలు అమరుస్తున్నారు.**

ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే కొన్ని విభాగాలు పూర్తిగా అందుబాటులోకి వచ్చాయి. ప్రయాణికుల రద్దీని క్రమబద్ధీకరించడానికి నిర్మించిన తాత్కాలిక బుకింగ్ కార్యాలయం, ప్రయాణికుల రక్షణను పర్యవేక్షించే రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ నూతన భవన నిర్మాణాలు వంద శాతం పూర్తయ్యాయి. వీటితో పాటు స్టేషన్‌కు దక్షిణం వైపున నిర్మిస్తున్న ప్రధాన అప్రోచ్ రోడ్డు పనులు కూడా విజయవంతంగా ముగిశాయి. ఈ పునరాభివృద్ధి పనులన్నీ త్వరలోనే పూర్తికానుండటంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ దేశంలోనే వన్-ఆఫ్-ది బెస్ట్ ఐకానిక్ స్టేషన్‌గా నిలవబోతోంది.

## గ్రేటర్ ఎన్నికల కోసం త్రిశూల వ్యూహం

**సికింద్రాబాద్, జూన్ 5, పెన్ పవర్:** హైదరాబాద్ వేదికగా జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సభకు పర్మిషన్ నిరాకరణ.. ఆ తర్వాత జరిగిన హైడ్రామా టాలీవుడ్ యాక్షన్ సినిమాను తలపిస్తోంది. పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేస్తూ అధికార కాంగ్రెస్ పార్టీ మంత్రులు, నేతలు ఊహించని స్థాయిలో అగ్రెసివ్‌గా దాడికి దిగడం వెనుక.. కేవలం ఒక ప్రెస్ మీట్ వివాదం మాత్రమే లేదు. దీని వెనుక వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికలను ప్రభావితం చేయగల అత్యంత లోతైన త్రిశూల వ్యూహం దాగి ఉందనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఒక ఇండోర్ మీటింగ్ పెట్టుకుంటే.. దానికి పర్మిషన్ నిరాకరించడమే కాకుండా, గాంధీ భవన్ వేదికగా కాంగ్రెస్ మంత్రులు పొన్నం ప్రభాకర్ వంటి వారు ప్రెస్ మీట్లు పెట్టి పవన్‌ను తెలంగాణ వ్యతిరేకిగా ప్రొజెక్ట్ చేయడానికి తీవ్రంగా ప్రయత్నించారు. కాంగ్రెస్ ఇంతలా రియాక్ట్ అవ్వడం వెనుక ఒక స్పష్టమైన ఫియర్ సైకాలజీ కనిపిస్తోంది. పవన్ వెనుక కేంద్రంలోని బీజేపీ పెద్దల హస్తం ఉందనేది కాంగ్రెస్ అనుమానం. తెలంగాణలో కాంగ్రెస్‌ను ఒంటరిగా ఢీకొట్టడం బీజేపీకి కష్టమే అయినా.. అదే బీజేపీకి పవన్ కల్యాణ్ గ్లామర్, గ్రేటర్ హైదరాబాద్‌లోని సెటిలర్ల ఓట్లు జతకలిస్తే సమీకరణాలు తారుమారవుతాయని కాంగ్రెస్ భయపడుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసే పోటీ చేసినా పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. కానీ, అప్పటి పరిస్థితి వేరు, ఇప్పటి పరిస్థితి వేరు. నాడు ఏపీలో పవన్ కల్యాణ్ కేవలం ఒక నేత మాత్రమే. కానీ నేడు ఏపీలో డిప్యూటీ సీఎంగా పవన్ ఇక్కడికి వచ్చారు. ఆయన గ్రాఫ్ ఇప్పుడు పీక్స్‌లో ఉంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దాదాపు 30 నుంచి 40 శాతం ఉన్న ఆంధ్రా సెటిలర్లు, కమ్మ-కాపు సామాజికవర్గాలు, యువతలో పవన్‌కు ఉన్న క్రేజ్.. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ అవకాశాలను దెబ్బతీసే ప్రమాదం ఉంది. అందుకే, పవన్‌కు ఇక్కడ స్పేస్ ఇవ్వకూడదని కాంగ్రెస్ దూకుడు ప్రదర్శిస్తోంది.ఈ వివాదంలో అత్యంత ఆసక్తికరమైన మలుపు.. పవన్ కల్యాణ్ ప్రెస్ మీట్‌లో కాంగ్రెస్‌ను కడిగిపారేస్తూనే, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై ప్రశంసలు కురిపించడం. కేసీఆర్ ఒక గొప్ప సంస్కృతి గల నాయకుడని, ఆయన ఎప్పుడూ ఆంధ్రా ప్రజలను అగౌరవపరచలేదని పవన్ సర్టిఫికేట్ ఇచ్చారు. దీనికి తగ్గట్లుగానే కేటీఆర్.. పవన్ కల్యాణ్ విషయంలో ప్రజాస్వామికంగా స్పందించారు. గతంలోనూ జనసేన పోటీ చేసిందని గుర్తు చేశారు. పవన్‌ను నేరుగా విమర్శించకుండా చాలా జాగ్రత్త పడ్డారు. పవన్ కల్యాణ్ పట్ల బీఆర్ఎస్ సాఫ్ట్ కార్నర్ మెయింటైన్ చేయడం వెనుక భవిష్యత్తు పొలిటికల్ ఫ్రెండ్‌షిప్ సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అలాగే పవన్ కూడా తనకు కేటీఆర్ మంచి స్నేహితుడని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ వ్యూహం చాలా స్పష్టంగా ఉంది. పవన్ కల్యాణ్‌కు బీఆర్ఎస్, బీజేపీ జతకట్టకుండా ఉండాలంటే.. ముందుగా పవన్‌ను తెలంగాణ అస్తిత్వానికి శత్రువు గా చిత్రించాలి. తెలంగాణ ఎవరి అయ్య జాగీరు కాదు అంటూ పవన్ చేసిన వ్యాఖ్యలను అస్త్రంగా చేసుకుని.. ఆయన తెలంగాణ అమరవీరులను, గద్దర్ వంటి ఐకాన్లను అవమానించారంటూ కాంగ్రెస్ సెంటిమెంట్‌ను రగిల్చే ప్రయత్నం చేస్తోంది. ఒకవేళ బీఆర్ఎస్ గనుక పవన్‌కు బహిరంగంగా మద్దతు ఇస్తే.. అప్పుడు బీఆర్ఎస్‌ను కూడా తెలంగాణ ద్రోహి గా ముద్ర వేసి, సెంటిమెంట్‌తో పొలిటికల్ మైలేజ్ పొందాలనేది రేవంత్ రెడ్డి మార్క్ స్కెచ్ అనుకోవచ్చు.రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్‌ను గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు ఉన్నాయి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత దేశవ్యాప్తంగా మారిన పరిణామాలతో.. వచ్చే అసెంబ్లీ లేదా గ్రేటర్ ఎన్నికల నాటికి బీజేపీ ం బీఆర్ఎస్ ం జనసేన కూటమిగా ఏర్పడినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఏపీలో జగన్‌ను గద్దె దించడానికి మూడు భిన్న ధ్రువాలు ఎలాగైతే కలిసాయో.. రేపు తెలంగాణలో రేవంత్ రెడ్డిని గద్దె దించడానికి బీజేపీ-జనసేనతో బీఆర్ఎస్ జతకట్టే అవకాశాలను కొట్టిపారేయలేం.ఏది ఏమైనప్పటికీ, పవన్ కల్యాణ్ హైదరాబాద్ ఎంట్రీతో తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కాంగ్రెస్ చేస్తున్న అగ్రెసివ్ అటాక్.. పవన్‌ను వెనక్కి నెట్టడం పక్కన పెడితే, ఆయనను తెలంగాణ పాలిటిక్స్‌లో మరింత సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మార్చేసింది. పవన్ వెనుక ఉన్న బీజేపీ వ్యూహాలు, బీఆర్ఎస్ వేస్తున్న అడుగులు చూస్తుంటే.. ముమ్మందు తెలంగాణలో ఊహించని పొలిటికల్ ఈక్వేషన్లు తెరపైకి రావడం ఖాయంగా కనిపిస్తోంది.

## పెన్షన్ల పథకంలో కీలక సంస్కరణలు

**హైదరాబాద్, జూన్ 5, పెన్ పవర్:** తెలంగాణలో అమలవుతున్న చేయూత సామాజిక భద్రతా పెన్షన్ల వ్యవస్థలో ప్రభుత్వం కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. లబ్ధిదారులకు పెన్షన్ సొమ్ము పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా మార్చేందుకు నగదు చెల్లింపుల విధానాన్ని క్రమంగా నిలిపివేసి, నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు చేయూత పథకం ద్వారా ప్రతి నెలా ఆర్థిక సహాయం పొందుతున్నారు. అయితే ఇప్పటికీ సంఖ్యలో లబ్ధిదారులకు నగదు రూపంలోనే పెన్షన్లు అందుతున్నాయి. గ్రామ స్థాయిలో అధికారులు, పోస్టల్ వ్యవస్థ ద్వారా ఈ పంపిణీ జరుగుతోంది. ఈ ప్రక్రియలో ఆలస్యాలు, అవకతవకలు, మధ్యవర్తుల జోక్యం వంటి అంశాలపై ప్రభుత్వం వద్దకు అనేక ఫిర్యాదులు చేరినట్లు తెలుస్తోందిముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు పెన్షన్ కోసం పోస్టాఫీసులు లేదా పంపిణీ కేంద్రాల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, కొన్ని చోట్ల సాంకేతిక సమస్యలు, రికార్డుల లోపాలు కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పెన్షన్ పంపిణీ వ్యవస్థను పూర్తిగా డిజిటల్ మోడ్‌లోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కొత్త విధానం కింద నగదు రూపంలో పెన్షన్ పొందుతున్న ప్రతి లబ్ధిదారుడికి బ్యాంకింగ్ సౌకర్యం కల్పించనున్నారు. అవసరమైన వారికి పోస్టల్ బ్యాంకు లేదా ఇతర బ్యాంకు ఖాతాలు తెరవడం, వాటిని ఆధార్‌తో అనుసంధానం చేయడం వంటి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది.ఇకపై ప్రభుత్వం విడుదల చేసే పెన్షన్ మొత్తం నేరుగా లబ్ధిదారుడి వ్యక్తిగత ఖాతాలో జమ అవుతుంది. దీంతో ఎవరిపైనా ఆధారపడకుండా, వారికి అనుకూలమైన సమయంలో ఏటీఎంలు, బ్యాంకులు లేదా ఇతర డిజిటల్ బ్యాంకింగ్ సేవల ద్వారా సొమ్మును పొందే అవకాశం ఉంటుంది. మరోవైపు కొత్త పెన్షన్‌ల మంజూరులో కూడా ప్రభుత్వం కొన్ని మార్పులు తీసుకురానుంది. ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలుస్తోంది. అలాగే ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్, సామాజిక-ఆర్థిక సర్వే వివరాలను అనుసంధానం చేసి అర్హుల జాబితాను మరింత కచ్చితంగా రూపొందించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారుల వివరాల ధృవీకరణ కోసం 'లైవ్ అథెంటికేషన్' ప్రక్రియ కొనసాగుతోంది. అర్హుల గుర్తింపు పూర్తయిన తర్వాత కొత్త వ్యవస్థను దశలవారీగా అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తయితే రాబోయే నెలల్లోనే పెన్షన్ సొమ్ము నేరుగా ఖాతాల్లో జమయ్యే విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.ఈ నిర్ణయంతో పెన్షన్ పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు, అవినీతి అవకాశాలు తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో లబ్ధిదారులకు సకాలంలో డబ్బులు చేరడం, మధ్యవర్తుల జోక్యం తగ్గడం, ప్రభుత్వ నిధుల వినియోగంపై మెరుగైన పర్యవేక్షణ సాధ్యమవుతుందని అధికారులు చెబుతున్నారు.

## అభివృద్ధి అంటే రోడ్లు బిల్డింగ్‌లు మాత్రమే కాదు, ప్రజలకు ఉపాధి కల్పించడమే నిజమైన అభివృద్ధి:మాజీ మంత్రి హరీశ్ రావు

**సిద్దిపేట పెన్ పవర్:**

సిద్దిపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన అద్వితీయ ఎంటర్‌ప్రైజెస్ దుస్తుల తయారీ పరిశ్రమను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.కేవలం నాలుగు రోడ్లు,బిల్డింగ్‌లు, కాలేజీలు, గుళ్లు కట్టడం లేదా కొమటిచెరువు గట్టును అభివృద్ధి చేయడం మాత్రమే నిజమైన అభివృద్ధి కాదని, ప్రజలకు ఉపాధి కల్పించి, వారి కాళ్ల మీద వారు నిలబడేలా చేయడమే అసలైన అభివృద్ధి అని స్పష్టం చేశారు. ఒక ప్రజాప్రతినిధిగా సిద్దిపేట మహిళలకు, గృహిణులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలనే తన కల టెక్ లైన్ మరియు అద్వితీయ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిజమవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలోని కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల యూనిఫామ్స్ ఆర్డర్లతో ఎంతోమందికి ఉపాధి కల్పిస్తూ, ఒక మహిళగా అద్భుతంగా రాణిస్తున్న టెక్ లైన్ అధినేత్రి భువనేశ్వరి కృషిని హరీశ్ రావు అభినందించారు. ఈ గొప్ప అవకాశాన్ని అందిపుచ్చుకుని, లాభాల కంటే పదిమందికి ఉపాధి చూపించాలనే ఉద్దేశంతో ప్రశాంత్ నగర్‌లో ఈ పరిశ్రమను నెలకొల్పిన కో-ఆపరేటివ్ చైర్మన్ తోట శ్రీకాంత్ రెడ్డి, బృందాన్ని ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. ప్రస్తుతం ఇక్కడ 70 మంది మహిళలు పని చేస్తున్నారని, త్వరలోనే 100 మంది స్టిచ్చింగ్, మరో 100 మంది ప్యాకింగ్ విభాగాల్లో మొత్తంగా 200 మంది మహిళలకు ప్రత్యక్షంగా ఉపాధి లభించనుందని ఆయన తెలిపారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఎన్వీడియా బంపర్ ఆఫర్

**హైదరాబాద్, జూన్ 5, పెన్ పవర్:**

లే ఆఫ్ లు కొనసాగుతున్నాయి. ఐటీ ఉద్యోగుల జాబ్ లు పోతున్నాయి. మనదేశం నుంచి మొదలు పెడితే అమెరికా వరకు ఇదే పరిస్థితి. ఉద్యోగాలు పోతే వచ్చే అవకాశం లేకుండా పోతోంది. దీంతో ఐటీ విభాగంలో పని చేసే వారు నరకం చూస్తున్నారు. ఉద్యోగం లేక.. వచ్చే అవకాశం లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. చెల్లించాల్సిన ఈఎంఐ లు, అప్పులు కొండల మాదిరిగా పేరుకుపోతున్నాయి.లే ఆఫ్ ల వల్ల ఉద్యోగాలు కోల్పోయిన వారికి ఎన్విడియా కంపెనీ గుడ్ న్యూస్ చెప్పింది. అమెరికాలో ఉంటున్న భారతీయ హెచ్ 1 బీ వీసాదారులు ఉద్యోగం కోల్పోతే 60 రోజుల్లో కొత్త ఉద్యోగం వెతుక్కోవాల్సి ఉంటుంది. లేకపోతే అమెరికా నుంచి వెళ్లిపోవాల్సి ఉంటుంది. ప్రపంచ ప్రఖ్యాత ఐటీ కంపెనీలు మొత్తం ఉద్యోగాలను తొలగిస్తున్న నేపథ్యంలో అనిశ్చితి వాతావరణం ఏర్పడింది.ఈక్రమంలో ప్రఖ్యాత ఐటీ కంపెనీ ఎన్ వీడియా విదేశాలలో ఉన్న ప్రతిభావంతులపై ఫోకస్ పెట్టింది. ఈనేపథ్యంలో హెచ్ 1 బీ వీసాదారులను లక్ష్యంగా చేసుకుంది. వారికి ఇచ్చే నియామకాలను పెంచింది. ఈ ఏడాది తొలి రెండు క్వార్టర్ లలో 1200మంది హెచ్ 1 బీ విభాగం కింద ఉద్యోగులను తీసుకునే అవకాశం ఉంది. దీనికి సంబంధించి అనుమతులను అమెరికా ప్రభుత్వం నుంచి పొందింది.అమెరికాకు హెచ్ 1 బీ వీసాదారులను భారత్ అధికంగా అందిస్తోంది. గత ఏడాది ఈ కంపెనీ హెచ్ 1బీ వీసాదారుల కేటగిరీలో వేయి మందికి ఉద్యోగాలు కల్పించింది ఎన్ వీడియా. ఈ ఏడాది భారీగా ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. హెచ్1 బీ వీసాదారుల్లో 70 శాతం మంది ఉద్యోగాలు పొందుతున్నారు. ఆ వీసా కింద ఉద్యోగాలు కల్పించే స్థాయి పెరిగితే భారతీయుల పంట పండినట్టే.ఎన్విడియా నియామకాలను జోరుగా పెంచుతోంది. ఇంజనీరింగ్, ఏఐ విభాగాలలో భారీగా ఉద్యోగులను భర్తీ చేస్తోంది.

భారీగా వేతనాలు కూడా ఇస్తోంది. ఒక ఇంజనీర్ కు ఏకంగా 3.72 కోట్లు, రీసెర్చ్ శాస్త్రవేత్తకు రూ.3.39 కోట్లు, ప్రొడక్ట్ మేనేజర్ కు రూ.3.61 కోట్లు, హార్డ్ వేర్ ఇంజనీర్ మేనేజర్లకు రూ. 3.50 కోట్లు, డైరెక్టర్ స్థాయి వ్యక్తులకు రూ. 4.64 కోట్ల దాకా ఇస్తోంది. స్టాక్ గ్రాంట్లను, బోనస్ లు కూడా ఇస్తోంది.ముఖ్యంగా ఏఐ అల్గారిథంఇంజనీర్లు, ప్రిన్సిపల్ సిస్టమ్ సాఫ్ట్ వేర్ ఇంజనర్లకు రూ.4 కోట్లకు పైగా వేతనాలు ఇస్తోంది. కస్టమర్ ఫేజింగ్, క్లౌడ్ ఇన్ ఫ్రా స్ట్రక్చర్, చిప్ డిజైన్, సాఫ్ట్ వేర్ ఇంజనీరింగ్ వంటి విభాగాలలో ఉద్యోగాలను భర్తీ చేస్తోంది ఎన్వీడియా.

# అభివృద్ధిలో పోటీ పడుతున్న రాష్ట్రాలు

**హైదరాబాద్, జూన్ 5, పెన్ పవర్:**

రాష్ట్ర విభజన జరిగి పుష్కరకాలం అవుతోంది. 2014 జూన్ 2న రాష్ట్ర విభజన అధికారికంగా జరిగింది. తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ విడిపోతుందని ఎవరు ఊహించలేదు. విడిపోతే రెండు రాష్ట్రాలు ఇబ్బందులు పడతాయి అన్న భావన ఎక్కువగా ఉండేది. కానీ 12 సంవత్సరాల తరువాత వెనక్కి తీసుకుంటే రెండు రాష్ట్రాలు అభివృద్ధి సాధించాయి. ఉమ్మడి రాష్ట్రపరంగా దక్షిణాది రాష్ట్రాల్లో వెనుకబాటు కనిపించినా.. రాష్ట్ర విభజన తరువాత తెలుగు రాష్ట్రాలు సత్తా చాటాయి. ఇక రాజకీయంగా సైతం తనదైన మార్కు చాటుకున్నాయి రెండు రాష్ట్రాలు. రెండు రాష్ట్రాల ప్రజలు రాజకీయంగా భిన్న వైఖరి ప్రదర్శించారు. అయినా సరే తన రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించారు.రాష్ట్ర విభజన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు అనుభవజ్ఞులకు ప్రాధాన్యమిచ్చారు. ఏపీలో చంద్రబాబు, తెలంగాణలో కెసిఆర్ కు ఛాన్స్ ఇచ్చారు. రాజధాని లేని ఏపీని చంద్రబాబు అయితేనే అభివృద్ధి చేయగలరని ప్రజలు ఆశించారు. తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కెసిఆర్ ను గుర్తించి.. అదే రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లగలరని భావించి అవకాశం కల్పించారు. అయితే ఏపీలో ఐదేళ్లకే అధికార మార్పిడి చేశారు. తెలంగాణలో మాత్రం కెసిఆర్ కు తొమ్మిదేళ్లపాటు అవకాశం కల్పించారు. మూడోసారి ఛాన్స్ ఇవ్వకపోగా.. ఏపీలో చంద్రబాబుకు మాత్రం రెండో ఛాన్స్ ఇచ్చి బ్యాలెన్స్ చేశారు.

తెలంగాణకు విద్యుత్ సమస్యలు, ఆంధ్రకు ఆర్థిక సమస్యలు వెంటాడుతాయని ఎక్కువ మంది అంచనా వేశారు. కానీ ఆ సమస్యలన్నింటినీ రెండు రాష్ట్రాలు అధిగమించాయి అని చెప్పవచ్చు. ఉమ్మడి రాష్ట్రపరంగా వెనుకబాటు ఉన్నా.. విభజిత రాష్ట్రాలుగా మిగతా దక్షిణాది రాష్ట్రాలకు గట్టి పోటీ ఇచ్చాయి.ఏపీలో మధ్యలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు ప్రజలు. తెలంగాణలో రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ ను గుర్తించి ఛాన్స్ కల్పించారు. ఇలా రాజకీయంగా కూడా బ్యాలెన్స్ చేశారు ఉభయ రాష్ట్రాల ప్రజలు.రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పుష్కర కాలంలోనే అంతరం పోయింది. మళ్లీ పాత రోజులు మాదిరిగానే సోదర భావం పెరిగింది. పారిశ్రామికంగా తెలంగాణ అభివృద్ధి సాధించగా.. ఏపీ కూడా నవనిర్మాణ దిశ గా అడుగులు వేసింది. పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మధ్య కొన్ని రకాల విభజన సమస్యలు ఉండిపోయాయి. చంద్రబాబు, కెసిఆర్ సమయంలో జరగలేదు.

కెసిఆర్ కు మిత్రుడైన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా మోక్షం కలగలేదు. కానీ ఇటు చంద్రబాబు, అటు రేవంత్ వచ్చిన తర్వాత మాత్రం పురోగతి పెరిగింది. రాష్ట్ర విభజనతో ఏపీ ప్రజలు బాధపడ్డారు మొదట్లో. కానీ పుష్కరకాలం తర్వాత మాత్రం మంచిదే అన్న అభిప్రాయానికి వచ్చారు. తెలంగాణ ప్రజలు ప్రారంభంలో సంబరపడ్డారు. కానీ ఇప్పుడు ఉమ్మడిగా ఉంటేనే కొంత కలిసి వచ్చేదేమో అనే రీతిలో ఆలోచన చేస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ సెంటిమెంట్ అనేది అక్కడి ప్రజల్లో తగ్గింది. ఆ సెంటిమెంట్తో రాజకీయాలు చేసిన పార్టీల హవా కూడా తగ్గింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలు ఇప్పుడు అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాయి. ప్రజల ఆకాంక్ష కూడా అదే.

# చాపకింద నీరులా మజ్లీస్

**హైదరాబాద్, జూన్ 5, పెన్ పవర్:**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు ముందే వాతావరణం హీటెక్కింది. గ్రేటర్ ను సొంతం చేసుకోవాలని అన్ని పార్టీలూ ప్రయత్నిస్తున్నాయి. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలు ప్రధానంగా పోటీ పడుతున్నాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు మూడు పార్టీలు ఎవరి ఎత్తుగడలు వారు వేస్తున్నారు. మరొకవైపు ఈ ఎన్నికల్లో తాము కింగ్ మేకర్ అవుతామని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఎంఐఎం అధికార కాంగ్రెస్ పార్టీతో లోపాయి కారీ ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్ లోని పాతబస్తీలో ఎక్కువ స్థానాలు గెలిచి తాము కీలకంగా మారాలన్నది ఎంఐఎం ఆలోచన.గతంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరిగినప్పటికీ ఎంఐఎం ఒకే విధానాన్నిఅమలు చేస్తుంది. ఎంఐఎం రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీతో పరోక్ష పొత్తు పెట్టుకుంటుంది. గ్రేటర్ ఎన్నికల్లో మాత్రం అధికార పార్టీకి మద్దతుగా నిలుస్తూ కీలకమైన పదవులు పొందుతుంది. మేయర్ పదవి ఎటూ దానికి దక్కదు కాబట్టి.. మిగిలిన కీలక పదవులపై పతంగి పార్టీ కన్నేసింది. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఎంఐఎం ఇదే స్ట్రాటజీని వాడింది. నాడు బీఆర్ఎస్ కు మద్దతుగా నిలిచి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీలో కీలక మైన పదవులను పొందడంలో అది సక్సెస్ కాగలిగింది.2023 లో జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో ఎంఐఎం కూడా తన రూటును మార్చుకుంది. అధికార కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తుంది. త్వరలో జరిగే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలలోనూ ఎంఐఎం తో కాంగ్రెస్ పరోక్ష పొత్తు పెట్టుకుంటుంది. అందుకే ఇటీవల పాతబస్తీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు

సంబంధించి మంత్రులు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు పలువురు పర్యటించారు. పాతబస్తీ మాత్రమే కాకుండా మిగిలిన నియోజకవర్గాల్లో ఎంఐఎం ఓటు బ్యాంకు ఉండటంతో

కాంగ్రెస్ కూడా దాని మద్దతును తీసుకునేందుకు, లోపాయి కారీ అవగాహన కుదుర్చుకునే అవకాశాలున్నాయి. మొత్తం మీద ఎంఐఎం మాత్రం ప్రతి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల సమయంలో కీలకంగా మారేందుకు చేసే ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ఈ సారి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# ఎలక్ట్రిక్ బస్సుల్లో ఉద్యోగ అవకాశాలు

**హైదరాబాద్, జూన్ 5, పెన్ పవర్:**

హైదరాబాద్ మహానగరంలో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య రోజురోజుకూ విస్తరిస్తుండటంతో, ఉపాధి కోసం నగరానికి వచ్చే యువతకు సరికొత్త అవకాశాలు లభిస్తున్నాయి. ప్రస్తుతం మియాపూర్, కంటోన్మెంట్, హెచ్‌సీయూ, హయాత్‌నగర్, రాణిగంజ్ డిపోల పరిధిలో నడుస్తున్న 440 ఎలక్ట్రిక్ బస్సుల కోసం నిబంధనల ప్రకారం సుమారు 1100 మంది డ్రైవర్లను నియమించారు. వీరిలో అత్యధికులు సంగారెడ్డి, వికారాబాద్, సిద్దిపేట, నల్గొండ, మహబూబ్‌నగర్ వంటి పొరుగు జిల్లాల నుండి వచ్చిన వారే కావడం విశేషం. ఉపాధి లభించడంతో వీరంతా కూకట్‌పల్లి, బాలానగర్, ఉప్పల్, ఎల్బీనగర్, మియాపూర్ డిపోల పరిసర ప్రాంతాల్లోనే తమ కుటుంబాలతో కలిసి స్థిరపడ్డారు.ఇటీవల కూకట్‌పల్లి డిపోలో కొత్తగా ప్రారంభించిన 60 బస్సుల కోసం నియామక ప్రక్రియ చేపట్టగా, మరో 150 మందికి ఉపాధి లభించింది.

రాబోయే రెండు సంవత్సరాలలో గ్రేటర్ పరిధిలోకి 2 వేలకు పైగా ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావాలని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే డ్రైవింగ్ రంగంతో పాటు ఇతర విభాగాలలో దాదాపు మరో 5 వేల మందికి కొత్తగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.ఈ ఉద్యోగాలకు ఎంపిక కావాలంటే అభ్యర్థులకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండటంతో పాటు, డ్రైవింగ్‌లో కనీసం

18 నెలలు లేదా అంతకంటే ఎక్కువ అనుభవం తప్పనిసరి. అర్హత సాధించిన డ్రైవర్లకు హకీంపేట కేంద్రంలో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ ఎంపికైన వారికి జిల్లాలతో పోలిస్తే మెరుగైన జీతం, జీరో యాక్సిడెంట్ అలవెన్స్ , ఇతర సదుపాయాలు కల్పిస్తుండటంతో ప్రవాసులు ఇక్కడే స్థిరపడటానికి ఆసక్తి చూపుతున్నారు.

**ఇతర విభాగాలలోనూ అవకాశాలు..**

వలం డ్రైవర్లు మాత్రమే కాకుండా టెక్నీషియన్, మెకానిక్, ఛార్జింగ్ స్టేషన్ ఆపరేటర్, మేనేజ్‌మెంట్ (నిర్వహణ) విభాగాలలో కూడా పెద్ద సంఖ్యలో కొలువులు లభిస్తున్నాయి. ఎలక్ట్రిక్ బస్సులకు ప్రత్యేకమైన బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ విడిభాగాలు ఉంటాయి. కాబట్టి ఈ తరహా వాహనాల సర్వీసింగ్‌లో నైపుణ్యం ఉన్న నిపుణుల కు మార్కెట్లో ప్రాధాన్యత , జీతాలు పెరుగుతు న్నాయి.గ్రేటర్ పరిధిలోని ఆరు డిపోలలో ఇప్పటికే ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా, రాబోయే రోజుల్లో మరిన్ని డిపోలలో ఈ వసతులను విస్తరించనున్నారు. ఈ మౌలిక సదుపాయాల కల్పన , పర్యవేక్షణ కోసం అనుభవజ్ఞులైన నిపుణులను ఆర్టీసీ అధికారులు నియమించుకుంటున్నారు.

# రాష్ట్రం ఏదైనా.. పవర్ పోతే అంతేనా?

**హైదరాబాద్ పెన్ పవర్:** రాజకీయాలు మారిపోయాయి. అధికారం చుట్టూనే రాజకీయం నడిచే పాడు రోజులు వచ్చి చాలాకాలమే అయ్యింది. అయితే.. ఇలాంటి దరిద్రాలు ఎక్కువగా తెలుగు రాష్ట్రాల్లోనే కనిపించేవన్న మాట బలంగా వినిపించేది. అందుకు భిన్నంగా ఇటీవల కాలంలో దేశంలోని పలు రాష్ట్రాలకు విస్తరించిన వైనం కనిపిస్తోంది. మిగిలిన రాష్ట్రాల సంగతి ఎలా ఉన్నా.. కమ్యూనిస్టులు సుదీర్ఘకాలం పాలించిన రాష్ట్రాల్లో రెండు ముఖ్యమైనవి అందులో ఒకటి పశ్చిమ బెంగాల్ అయితే రెండోది కేరళం (కేరళ) ఈ రెండు రాష్ట్రాల్లో ఒక రాజకీయ పార్టీ చేతిలో ఉన్న అధికారం చేజారితే.. ఆ పార్టీ చెల్లాచెదురు కావటం పెద్దగా కనిపించదు. కానీ.. తాజాగా మాత్రం పశ్చిమబెంగాల్ లో చోటు చేసుకుంటున్న పరిణామాలు చూస్తే.. అధికారం చుట్టూనే రాజకీయం.. రాజకీయ నేతలన్న విషయం స్పష్టమవుతోంది. బ్యాక్ టు బ్యాక్ అన్నట్లుగా పదిహేనేళ్ల పాటు సుదీర్ఘంగా బెంగాల్ రాజకీయాల్ని ఒంటిచేత్తో నడిపిన దీదీ అలియాస్ మమతా బెనర్జీ ఇప్పుడు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పార్టీ ఏదైనా.. అధినేత ఎవరైనా.. తనకు నచ్చినట్లుగా.. తన పొలిటికల్ లెక్కలకు సరిపడే వారికి మాత్రమే కనీస గౌరవ మర్యాదలు దక్కేలా వ్యవహరించేవారు. ముఖ్యమంత్రులుగా వ్యవహరించి.. కాలం కర్మం బాగోక అధికారం చేజారితే అలాంటి ఇతర రాష్ట్రాలకు చెందిన అధినేతల్ని కలిసేందుకు సైతం ఇష్టపడని ట్రాక్ రికార్డు మమత సొంతం. అలాంటి ఆమెకు ఇప్పుడు చోటు చేసుకుంటున్న పరిణామాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.ఇటీవల వెల్లడైన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో పార్టీ ఘోర పరాజయం పాలు కావటం ఒక ఎత్తు అయితే.. ఆ తర్వాత ప్రజల నుంచి ఎదురవుతున్న వ్యతిరేకత.. తమ పార్టీ నేతలకు ఎదురవుతున్న చేదు అనుభవాలు ఆమెకు మరింత ఇబ్బందికరంగా మారాయి. నా మాటే శాసనం అన్నట్లుగా దశాబ్దాన్నర కాలం పాటు వ్యవహరించిన అధినేత మాట తాజాగా పూచిక పుల్లతో సమానంగా




మారటాన్ని దీదీ లాంటి వారు జీర్ణించుకోవటం అంత తేలికైన విషయం కాదు.ఘోర పరాజయం నేపథ్యంలో పార్టీకి చెందిన 58 మంది ఎమ్మెల్యేలు బుధవారం వేరు కుంపటి పెట్టుకోగా.. అలాంటి షాక్ తగిలిన 24 గంటల్లోపే మరో దిమ్మతిరిగే షాక్ దీదీకి ఎదురైంది. పార్టీకి చెందిన కనీసం 20 మంది ఎంపీలు బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే.. మమతా బెనర్జీకి కోలుకోలేని దెబ్బ తగిలినట్లు అవుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఆమె పార్టీకి లోక్ సభలో 28 మంది ఎంపీలు ఉంటే.. రాజ్యసభలో 13 మంది ఎంపీలు ఉన్నారు. వీరిలో అత్యధికులు పార్టీ మారే ఆలోచన చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. అదే జరిగితే.. అదంతా దీదీ వైఫల్యంగానే చెప్పాలి. అధికారంలో ఉన్నప్పుడు ఎవరి మాటకు పెద్ద ప్రాధాన్యత ఇవ్వకుండా..తాను నమ్మిన దారిలో నడవటం.. అలా నడిచే అంశంపై పార్టీలో వ్యతిరేకత ఉన్నప్పటికి.. తనకున్న అధికార బలంతో బయటకు రాకుండా ఉండేలా వ్యవహరించిన ఆమెకు.. ఇప్పుడు కొత్త అనుభవాలు ఎదురవుతున్నాయి. ఆమెకు అత్యంత సన్నిహితులుగా చెప్పే వారు సైతం ఆమె నుంచి దూరమవుతున్నారు. తాజాగా దీదీకి అత్యంత సన్నిహితుడన్న పేరున్న కోల్ కతా మేయర్ గా వ్యవహరించే ఫర్హాద్ హకీమ్ సైతం తన పదవికి రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి సువేందుతో చర్చలు జరిపిన తర్వాత ఈ నిర్ణయం తీసుకోవటం చూస్తే.. అధికారం ఉన్నంతవరకు చుట్టూ ఉన్న వారంతా.. పవర్ చేజారిన తర్వాత అంతే సంగతులన్న కొత్త విషయం దీదీ అనుభవంలోకి వచ్చినట్లైంది. మరి.. ఈ వరుస షాకులకు ఆమె ఎలా రియాక్టు అవుతారో చూడాలి.

# గ్లోబల్ సిటీగా ఆంధ్రా

**విజయవాడ జూన్ 5, పెన్ పవర్:**
ఇప్పటివరకు ఐటీ రంగం అత్యధిక ఉద్యోగాలను కల్పిస్తోంది. ఏపీ సరికొత్త మైలురాళ్లు అందుకునేందుకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే గూగుల్ నుంచి మొదలు పెడితే పెద్దపెద్ద కంపెనీల వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయి. భారీగా కార్యకలాపాలను సాగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి. అయితే ఇక్కడితోనే ఏపీ పారిశ్రామిక ప్రస్థానం ఆగిపోవడం లేదు. అంతకుమించి అనేలాగా ఏపీ మంత్రి నారా లోకేష్ అడుగులు వేస్తున్నారు.చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఐటీ రంగానికి విశేషమైన ప్రాధాన్యం ఇచ్చారు. పెట్టుబడులు పెట్టే విధంగా కంపెనీలకు ప్రోత్సాహకాలు కల్పించారు. ఆయన కల్పించిన స్వేచ్ఛాయుతమైన వాణిజ్య విధానం నేడు హైదరాబాద్ నగరాన్ని మన దేశానికి రెండవ ఐటి రాజధానిగా చేసింది.విభజిత ఆంధ్ర ప్రదేశ్ లో కూడా ఐటీ రంగానికి విశేషమైన ప్రాధాన్యం ఇస్తున్నారు చంద్రబాబు. ఈ క్రమంలో దేశీయంగా పేరుపొందిన కంపెనీలు పెట్టుబడులు పెట్టే విధంగా రూపకల్పన చేస్తున్నారు. గూగుల్ నుంచి మొదలు పెడితే టిసిఎస్ వరకు పెద్ద పెద్దకంపెనీలు ఆంధ్రప్రదేశ్లో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఐటీరంగం తీవ్రంగా ప్రభావితం అవుతుంది. భవిష్యత్తులో ఏం జరుగుతుందో తెలియడం లేదు ఈ నేపథ్యంలో కొత్త ఆలోచన చేశారు ఏపీ మంత్రి నారా లోకేష్. తన తండ్రి మాదిరిగానే వినూత్నంగా ఆలోచించి.. ఏపీ రాష్ట్రానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నారు.నారా లోకేష్ ప్రస్తుతం రష్యాలో పర్యటిస్తున్నారు. అక్కడ అనేక రకాల కంపెనీల ప్రతినిధులతో మాట్లాడారు. ఏపీలో ఉన్న పరిస్థితుల గురించి.. పెట్టుబడులకు అనుకూలంగా ఉన్న విధానాల గురించి వెల్లడించారు. ఇక్కడితోనే నారా లోకేష్ ఆగిపోలేదు. ఏకంగా స్పేస్ పాలసీ గురించి వెల్లడించారు. తమ రాష్ట్రానికి స్పేస్ పాలసీ అనేది ఒకటి ఉందని.. తద్వారా రెండు ప్రత్యేకమైన స్పేస్ సిటీలను ఏర్పాటు చేస్తున్నామని నారా లోకేష్ వివరించారు.రష్యాలోని ఎస్పీఐఎఫ్ వేదికగా జరుగుతున్న సదస్సులో ఆయన మాట్లాడారు.. స్పేస్ సిటీల ద్వారా 25వేల కోట్ల పెట్టుబడులు.. 5000 మందికి ప్రత్యక్షంగా.. 30 వేల మందికి పరోక్షంగా ఉద్యోగాలు అందిస్తామని ఆయన ప్రకటించారు.. అంతరిక్షంలో ప్రయోగాలు చేసే వాహనాలకు సంబంధించిన అసెంబ్లింగ్.. ఉపగ్రహాల తయారీ.. ఇతర పరికరాల కోసం తిరుపతి సమీపంలో దాదాపు 2,800 ఎకరాల విస్తీర్ణంలో స్పేస్ సిటీని ఏర్పాటు చేస్తున్నామని నారా లోకేష్ వివరించారు.ఇప్పటికే రాయల్ ఎన్ఫీల్డ్ రాయలసీమలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది. కియా పరిశ్రమ రాయలసీమ ముఖ చిత్రాన్ని మార్చేసింది. ఇంకా అనేక రకాల పరిశ్రమలు రాయలసీమలో ఏర్పాటు కాబోతున్నాయి. ఇప్పుడు స్పేస్ సిటీ ద్వారా రాయలసీమలో ప్రధాన పట్టణమైన తిరుపతికి సరికొత్త గుర్తింపు రానుంది. ఆధ్యాత్మిక ప్రాంతంగా ప్రపంచ స్థాయి పేరు తెచ్చుకున్న తిరుపతి.. ఇప్పుడు పారిశ్రామికపరంగా కూడా సరికొత్తగా గుర్తింపును అందుకోనుంది.పారిశ్రామికంగా ఒక రాష్ట్రం బాగుంటే పెట్టుబడులు బాగా వస్తాయి. ఆ రాష్ట్రానికి గ్లోబల్ గుర్తింపు తీసుకొస్తే పెట్టుబడులకు ఇబ్బంది ఉండదు. అందువల్లే నారా లోకేష్ దూకుడు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఆయన విదేశాలలో పర్యటిస్తూ.. పెద్దపెద్ద కంపెనీల ప్రతినిధులతో మాట్లాడుతూ.. వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టించే విధంగా ఒప్పిస్తున్నారు. గతంలో దావోస్ లో పర్యటించిన నారా లోకేష్.. అనేక కంపెనీల ప్రతినిధులతో మాట్లాడారు. ఎం ఓ యు లు కుదుర్చుకున్నారు. ఫలితంగా ఆ కంపెనీలు ఏపీ రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయి.ఇటీవల రాయల్ ఎన్ఫీల్డ్ వంటి కంపెనీ ఏపీలో పెట్టుబడులు పెట్టింది. రాయలసీమలో వాహనాల తయారీని చేపడుతోంది. గతంలోని రాయలసీమ ప్రాంతంలో కియా పరిశ్రమ ఏర్పాటు అయింది. ఇప్పుడు నారా లోకేష్ రష్యాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఆ దేశ వ్యాపారవేత్తలతో సమావేశం అయ్యారు. మైక్రో ఎలక్ట్రానిక్స్ విభాగంలో పేరుపొందిన ఎలిమెంట్ గ్రూప్.. అల్యూమినియం ఉత్పత్తులు తయారుచేసే రూసాల్.. కెమికల్ ఉత్పత్తులు తయారుచేసే రస్కెమ్ వంటి కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. తమ రాష్ట్రంలో పెట్టుబడి పెట్టాలని వారిని ఆహ్వానించారు.వారితో సుదీర్ఘ సమయం సమావేశం నిర్వహించిన లోకేష్.. ఏపీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అనుకూలమైన పరిస్థితుల గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడిల ప్రోత్సాహక అనుమతుల గురించి వివరించారు. ఆ తర్వాత మాస్కో ట్రాన్స్పోర్ట్ డెవలప్మెంట్ సెంటర్ ను లోకేష్ సందర్శించారు. అక్కడి రవాణా వ్యవస్థ నిర్వహణపై స్థానిక అధికారులను ప్రశంసించారు. ఏపీ రాష్ట్రంలో కూడా ఇటువంటి విధానాన్ని అమలులోకి తీసుకొస్తామని ఆయన పేర్కొన్నారు.

# రఘురామ వర్సెస్ సునీల్

## అట్రాసిటీ అస్త్రం - దళిత సెంటిమెంట్ రాజకీయం

**భీమవరం, జూన్ 5, పెన్ పవర్:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో సీఐడీ చీఫ్గా వ్యవహరించి, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో సస్పెన్షన్లో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్.. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును లక్ష్యంగా చేసుకుని చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఐపీఎస్ అధికారి అన్న హోదాను పక్కనబెట్టి సునీల్ కుమార్ విసురుతున్న రాజకీయ సవాళ్లు, దానికి రఘురామ ఇస్తున్న కౌంటర్లతో ఇరుపక్షాల మధ్య డైలాగ్ వార్ పీక్స్కు చేరింది. గత ప్రభుత్వ హయాంలో రఘురామకృష్ణరాజు అరెస్ట్, ఆ తర్వాత జరిగిన కస్టోడియల్ టార్చర్ కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న పీవీ సునీల్ కుమార్.. ఇటీవల కాలంలో పూర్తిగా ఒక పొలిటికల్ లీడర్ అవతారమెత్తారు. రఘురామ గనుక తన డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసి వస్తే.. ఆయనపై తాను పోటీ చేసి వేయి ఓట్ల మెజారిటీతో ఓడిస్తానని సునీల్ కుమార్ విసిరిన సవాల్ తీవ్ర దుమారం రేపింది. అయితే రఘురామ ఇప్పుడు రాజీనామా చేయరని, ఒకవేళ చేసినా సునీల్ కుమార్నేరుగా వచ్చి పోటీ చేయరని అందరికీ తెలిసిన సత్యమే. కానీ, రఘురామకృష్ణరాజు అనే ఒక పెద్ద లీడర్ను బూచి గా చూపిస్తూ.. ఆ వివాదం ద్వారా తన పొలిటికల్ ఇమేజ్ను పెంచుకోవడమే సునీల్ కుమార్ అసలు వ్యూహమని భావిస్తున్నారు.ఈ వివాదంలో అత్యంత విచిత్రమైన, చట్టపరమైన తిరకాసు ఏమిటంటే.. పీవీ సునీల్ కుమార్ ఇంకా అధికారికంగా పోలీస్ సర్వీస్లోనే ఉన్నారు. సస్పెన్షన్లో ఉన్నప్పటికీ అఖిల భారత సర్వీస్ నిబంధనల ప్రకారం ఒక ఐపీఎస్ అధికారి ఇలా ప్రత్యక్ష రాజకీయ సవాళ్లు విసరడం, ప్రెస్ మీట్లు పెట్టడం నిబంధనలకు విరుద్ధం. అయితే, తాను సర్వీస్లో ఉన్నాననే విషయాన్ని కూడా పక్కనబెట్టి, నేరుగా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉన్న రఘురామతో రాజకీయ సవాళ్లు చేస్తున్నారు. భీమవరం వేదికగా జరిగిన దళిత సామాజికవర్గాల సమావేశంలో ఆయన మాట్లాడిన తీరు చూస్తే.. త్వరలోనే రిటైర్ అయిన తర్వాత నేరుగా వైఎస్ఆర్సీపీలో చేరి రఘురామపై పోరాడతాననే బలమైన సంకేతాలను ఇస్తున్నారు.ఈ రాజకీయ వివాదానికి పీవీ సునీల్ కుమార్ దళిత సెంటిమెంట్ను, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల అంశాన్ని జోడించడం ద్వారా మైలేజ్ సాధించాలని చూస్తున్నారు. దళితుల రక్షణ కోసమే తాను నిలబడ్డానని, తాను సీఐడీ చీఫ్గా ఉన్నప్పుడు దాదాపు 4,000 ఎస్సీ, ఎస్టీకేసుల్లో ఛార్జ్షీట్లు వేయించానని సునీల్ కుమార్ ప్రకటించుకున్నారు. రఘురామతో ఉన్న పాత గొడవను కేవలం వ్యక్తిగత కక్షగా కాకుండా.. దానిని దళిత వర్గాల ఆత్మగౌరవ పోరాటంగా మార్చడం ద్వారా వైఎస్ఆర్సీపీలో ఒక కీలకమైన దళిత ఫేస్ గా ప్రొజెక్ట్ అవ్వాలనేది ఆయన స్కెచ్. సునీల్ కుమార్ వ్యాఖ్యలపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అంతే ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. భీమవరంలో జరిగింది మత సభ లేదా సామాజిక సభ కాదని, అది పక్కా వైసీపీ పార్టీ సభ అని రఘురామ ఎద్దేవా చేశారు. అసలు ఒక ఐపీఎస్ అధికారి 4,000 ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఛార్జ్షీట్లు ఎలా వేయిస్తారని, అది కోర్టులు ,దర్యాప్తు అధికారుల పరిధిలోని అంశమని గుర్తుచేశారు. హింసను ప్రేరేపించేలా మాట్లాడుతున్న, సర్వీస్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న సునీల్ కుమార్పై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రఘురామకృష్ణరాజు ఇటీవల రామాలయంతో పాటు చర్చి విషయంలోనూ వివాదాస్పదం అయ్యారు. ఆయనకు కౌంటర్ ఇచ్చే గట్టి నాయకుడి కోసం జగన్ చూస్తున్నారు. సరిగ్గా ఈతరుణంలో కూటమిలో అత్యంత కీలకమైన రఘురామకృష్ణరా జును టార్గెట్ చేయడం ద్వారా జగన్ దృష్టిలో పడాలనేది సునీల్ కుమార్ ప్లాన్. కూటమి ప్రభుత్వంపై ఎంత గట్టిగా పోరాడితే.. వైసీపీలో అంతటి ప్రాధాన్యత దక్కుతుందనే ఆలోచనతోనే, రఘురామతో ఉన్న వివాదాన్ని తన భవిష్యత్తు పొలిటికల్ కెరీర్కు పెట్టుబడిగా మార్చుకోవడానికి సునీల్ కుమార్ సిద్ధమయ్యారన్న అభిప్రాయం వినిపిస్తోంది. రాజకీయాల్లో ఒక పెద్ద లీడర్ను ఢీకొట్టడం ద్వారా రాత్రికి రాత్రే పాపులారిటీ తెచ్చుకోవాలనే పాత ఫార్ములాను పీవీ సునీల్ కుమార్ వాడుకుంటున్నారు. అయితే, ఖాకీ చొక్కా విప్పక ముందే ఇలాంటి బహిరంగ రాజకీయ సవాళ్లు విసరడం ఆయన చుట్టూ మరిన్ని చట్టపరమైన చిక్కులను తెచ్చిపెట్టేలా ఉంది. మరి రఘురామకృష్ణరాజును బూచిగా చూపిస్తూ సునీల్ కుమార్ వేసుకుంటున్న ఈ పొలిటికల్ రూట్మ్యాప్ ఆయనను వైఎస్ఆర్సీపీలో ఏ స్థాయికి తీసుకెళ్తుందో వేచి చూడాలి.

# వైసీపీలో సీట్ల లొల్లి...

**విజయవాడ, జూన్ 5, పెన్ పవర్:** వైసీపీలో టిక్కెట్ల రగడ ఇప్పటి నుంచే మొదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికలు పూర్తయి రెండేళ్లు పూర్తి కావస్తుండటం, స్థానిక సంస్థల ఎన్నికలు వస్తుండటంతో జగన్ తో ముందుగానే టిక్కెట్ ఖరారు చేయించుకోవాలని నేతలు భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖర్చు చేయాలంటే తమకు వచ్చే ఎన్నికలలో టిక్కెట్ హామీ ఇవ్వాల్సిందనని కొందరు పట్టుబడుతున్నారు. ఈ విషయాన్ని నేరుగా జగన్ తో చెప్పలేకపోయినా.. సజ్జల వంటి వారితో చెప్పి తమ మనసులో మాటను చెప్పుకుంటున్నారు. అలాగయితేనే తాము స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖర్చు చేస్తామన్న షరతును కూడా కొందరు పెడుతున్నట్లు సమాచారంస్థానిక సంస్థల ఎన్నికలను వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ ఎన్నికల్లో గెలిచి నిలవాలన్న ప్రయత్నంలో ఉన్నారు. తమకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్ననలభై శాతం ఓటు బ్యాంకును అలాగే పదిలపర్చుకోవాలంటే లోకల్ బాడీ ఎన్నికల్లో పోటీ చేసి తీరాలని, అందుకు సరైన అభ్యర్థులను ఎంపిక చేయాలని కూడా జగన్ సూచించినట్లు తెలిసింది. అయితే రిజర్వ్డ్ పంచాయతీలు, వార్డులు, డివిజన్లతో పాటు ఆర్ధికంగా బలహీనంగా ఉన్న వారికి అండగా నిలవాలని కూడా నియోజకవర్గ ఇన్ ఛార్జులకు జగన్ దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. దీంతో తాము ఖర్చుచేయాలంటే తమకు టిక్కెట్ హామీ ఇవ్వాలని జగన్ కు షరతు విధిస్తున్నారని తెలిసింది.వైసీపీలో చివరి వరకూ టిక్కెట్ ఖరారు అవ్వడం కష్టమే. అనూహ్యంగా కొత్త అభ్యర్థులు తెరపైకి తీసుకు వచ్చేఅలవాటు జగన్ కు ఎప్పటి నుంచో ఉంది. అదే భయం. 2014 ఎన్నికల నుంచి జగన్ అభ్యర్థుల ఎంపికలో అనేక విధానాలను పాటిస్తుండటం, కోరుకున్న వారికి సీటు దక్కకపోవడంతో ఈసారి తమకుటిక్కెట్ దక్కుతుందో లేదో? అన్న సందేహం నియోజకవర్గ ఇన్ ఛార్జుల్లో ఉంది. నియోజకవర్గ ఇన్ ఛార్జులయినంత మాత్రాన టిక్కెట్ ఇస్తారన్న గ్యారంటీ లేదు. అందువల్లనే ఇప్పుడే టిక్కెట్ హామీ ఇవ్వాలని,లేదంటే మరొకరికి పార్టీ ఇన్ ఛార్జి పదవి ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని కొందరు తెగేసి చెప్పినట్లు సమాచారం. మొత్తం మీద జగన్ మీద ఇప్పటి నుంచే నేతలు ప్రెజర్ తెస్తుండటంతో ఒకింతచర్చనీయాంశంగా మారింది. మూడేళ్లకు ముందే ఈ షరతులేంటి అని కొందరు పార్టీ అగ్రనేతలు విస్తుపోతున్నారట.అమరావతిపై వ్యూహాత్మక అడుగులుఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వ్యవహారంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. అమరావతి ప్రాంతంలో పార్టీ తరపున కార్యాచరణను పటిష్టం చేసేందుకు, అదేసమయంలో న్యాయపరమైన అంశాలను ఎదుర్కొనేందుకు వీలుగా రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. అమరావతి పరిధిలో రైతుల సమస్యలు, ప్రాంతీయ పరిణామాలను పర్యవేక్షించేందుకు 8మంది సభ్యులతో కూడిన 'రైతు పరిరక్షణ కమిటీ'ని వైస్సార్సీపీ నియమించింది. ఈ కమిటీలో కమిటీలో వైస్సార్సీపీ సీనియర్ నేతలు పేర్ని నాని, అంబటి రాంబాబు, దేవినేని అవినాశ్, నందిగం సురేశ్,అప్పిరెడ్డి, అరుణ్ కుమార్, వజ్రబాబు సభ్యులుగా ఉన్నారుఇక అమరావతి రాజధాని వ్యవహారాలకు సంబంధించిన వివాదాలపై కోర్టులలో పార్టీ తరపున వాదనలు బలంగా వినిపించేందుకు, చట్టపరమైనచర్యల కోసం లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఓ ప్రత్యేక 'న్యాయపోరాట కమిటీ'ని కూడా నియామకం చేసింది. ఇందులో సభ్యులుగా పొన్నవోలు సుధాకర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, కిషోర్ ఉంటారు. రాజధాని ప్రాంతంలో క్షేత్రస్థాయిలో రైతుల పక్షాన నిలబడటంతో పాటు, ఇటు న్యాయస్థానాల్లో కూడా గట్టిగా పోరాడేందుకు వీలుగా వైసీపీ ఈ వ్యూహాత్మక కమిటీలను ఏర్పాటు చేసినట్లుగా పొలిటికల్సర్కిల్స్లో చర్చ జరుగుతోంది.చివరగా.. ఐదుగురు సభ్యులతో డీఎస్సీ పోరాట కమిటీని నియమించారు. ఇందులో సభ్యులుగా అప్పిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కల్పలత, చైతన్య, రవిచంద్ర ఉంటారని వైసీపీ రాష్ట్ర అధినాయకత్వ నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.

## 2029 లక్ష్యంగా స్థానిక నేతలు

**గుంటూరు, జూన్ 5, పెన్ పవర్:** రానున్న ఎన్నికల్లో తిరిగి కూటమి అధికారంలోకి తెచ్చేందుకు చంద్రబాబు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అందుకోసం అభ్యర్థుల ఎంపికలో రాజీ పడకూడదని నిర్ణయించుకున్నారు. 2029 ఎన్నికల్లో గెలిచి తీరాలంటే అంతకంటే ముందుగా వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల్లో దాదాపు వైసీపీని లేకుండా చేయాలని, తద్వారా మానసికంగా దెబ్బతీయాలని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకోసమే చంద్రబాబు నెలలో పదిహేను రోజుల పాటు వివిధ కార్యక్రమాల పేరుతో జిల్లాల పర్యటనలు చేస్తున్నారు. ఏదో ఒక కార్యక్రమాన్ని పెట్టుకుని ఆ జిల్లాలకు వెళ్లి కార్యకర్తలతో సమావేశమవుతున్నారు. క్యాడర్ లో ఉత్తేజం తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారు.క్యాడర్ మరింత బలంగా పనిచేసేందుకు కార్యకర్తల సమావేశంలోనే ఎమ్మెల్యేల పనితీరును ప్రశ్నించడం కూడా చంద్రబాబు గెలుపు వ్యూహంలో భాగమేనని అంటున్నారు. స్థానిక ఎమ్మెల్యేపై క్యాడర్ అసంతృప్తిగా ఉందని గుర్తించిన చంద్రబాబు ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవాలంటే ఎమ్మెల్యేలకంటే క్యాడర్ ముఖ్యం. ఆ విషయాన్ని గుర్తించిన చంద్రబాబు వేదికపైనే ఎమ్మెల్యేల తప్పులను ఎత్తి చూపుతున్నారు. క్యాడర్ కు తాను ఉన్నానని భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. మరొకవైపు లోకేశ్ కూడా జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు ఖచ్చితంగా కార్యకర్తలతో సమావేశాలు పెడుతుండటం వారిలో ఉత్తేజం తేవడం కోసమే.ప్రస్తుతం ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉందని చంద్రబాబుకు తెలియనిది కాదు. ప్రజలతో పాటు కార్యకర్తలు కూడా ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తితో ఉన్నారు. మద్యం, ఇసుక వంటి వాటిల్లో ఎమ్మెల్యేలు కూరుకుని ఉండటంతో వారిని ఇప్పటికే చంద్రబాబు పిలిచి వార్నింగ్ ఇచ్చారు. ఫస్ట్ టైం ఎమ్మెల్యేలుగా మిగిలిపోవద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు. అయినా కొందరి ఎమ్మెల్యేల పనితీరు మారకపోవడం, కార్యకర్తల్లో ఉన్న నిరాశ, నిస్పృహలను పారదోలి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం చేసేందుకు చంద్రబాబు ఈ పథాన్ని ఎంచుకున్నారు. లోకల్ బాడీ ఎన్నికల్లో గెలవడంతో పాటు రానున్న అసెంబ్లీ ఎన్నికల వరకూ క్యాడర్ ను కాపాడుకునేందుకు చంద్రబాబు చేస్తున్న ఈ ప్రయత్నం ఎంత వరకూ ఫలిస్తుందో చూడాలి.

# పంథా మార్చిన పవన్...



**కాకినాడ, జూన్ 5, పెన్ పవర్:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన మీద పడిన ముద్రను చెరిపేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల వరకూ ఆయన మౌనంగానే ఉన్నారు. ప్రభుత్వంలో జరిగిన, తప్పొప్పులను ప్రశ్నించడం లేదు. అయితే ఇప్పుడు పూర్తిగా తన పంథాను మార్చుకున్నారు. పవన్ కల్యాణ్ ఇప్పటికే రాజకీయాల్లో తాను ఏం చేయాలి? ఎలా ఉండాలి? అన్న దానిపై ఒక క్లారిటీకి వచ్చినట్లుంది. ఏపీ రాజకీయాల్లో కేవలం టీడీపీ, వైసీపీ చుట్టూ రాజకీయాలు తిరగకుండా జనసేన ను కూడా అందులో యాడ్ చేయాలన్న తపన పవన్ కల్యాణ్ లో కనిపిస్తుంది. అందుకే ఆయన ఇటీవల కాలంలో తీసుకుంటున్న నిర్ణయాలు ఒకింత కూటమిలోని మిత్ర పక్షాలను కూడా ఆలోచనలో పడేస్తున్నాయి.ముందుగా గీత దాటిన ఎమ్మెల్యేలపై చర్యలకు సిద్ధమవుతున్నారు. రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను విప్ పదవి నుంచి తప్పించారు. అలాగే ప్రకాశం జిల్లా పార్టీ కార్యవర్గాన్ని మొత్తం రద్దు చేశారు. ఇది ఒక రకంగా టీడీపీకి బలమైన సంకేతాలు ఇచ్చినట్లయింది. టీడీపీ ఎమ్మెల్యేలు అనేక మందిపై ఆరోపణలు వచ్చాయి. ఒక ఆదిమూలం మినహా టీడీపీ ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. అవినీతి ఆరోపణలు వచ్చినా చూసీ చూడనట్లు టీడీపీ వదిలేస్తుందన్న సిగ్నల్స్ ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లిపోయాయి. అందుకే పవన్ కల్యాణ్ తాను అందరి లాంటి వాడిని కానని, రాజకీయాల్లో మార్పుకోసమే వచ్చానని చెప్పడానికి ఈ ప్రయత్నం పవన్ చేస్తున్నట్లు కనిపిస్తుంది.ఇక ఇప్పటి వరకూ ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ అధికార యంత్రాంగంపై పెద్దగా సీరియస్ అయిన దాఖలాలు కూడా లేవు. కానీ ఇప్పుడు మాత్రం అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్నారు. గోదావరి కాలుష్యం పై మంత్రిపైన, అధికారులపైన కూడా హాట్ కామెంట్స్ చేశారు. అధికారులు సక్రమంగా పనిచేయకపోతే ఊరుకునేది లేదని హెచ్చరికలు పంపారు. దీంతో పవన్ కల్యాణ్ వైసీపీ, టీడీపీకి ప్రత్యామ్నాయం తానేనంటూ ప్రజలకు తెలియజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. పవన్ కల్యాణ్ తనకంటూ ఒక వ్యూహం ఉందని చెబుతూ పార్టీని కూడా పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తూ, క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని నిర్ణయించడం కూడా పొలిటికల్ గేమ్ లో భాగమేనని అంటున్నారు. మొత్తం మీద పవన్ కల్యాణ్ అధికారంలో ఉన్నప్పుడే పార్టీని సెట్ చేయాలని, ప్రత్యామ్నాయంగా ఎదగాలని ప్లాన్ చేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# భారత్‌కు పుతిన్ బిగ్ ఆఫర్.. సుఖోయ్ సు-57పై సంచలన ప్రతిపాదన!



భారత రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఒక సంచలన ప్రతిపాదన చేశారు. ప్రపంచవ్యాప్తంగా రక్షణ సమీకరణాలు వేగంగా మారుతున్న తరుణంలో భారత్‌కు అత్యంత కీలకమైన ఐదో తరం యుద్ధ విమానాల సాంకేతికతను పంచుకోవడానికి రష్యా సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. రష్యా గర్వకారణంగా చెప్పుకునే అత్యాధునిక స్టెల్త్ సామర్థ్యాలు గల సుఖోయ్ సు-57 ఫైటర్ జెట్ల ఉమ్మడి అభివృద్ధి, ఉత్పత్తిలో భాగస్వామ్యం కావాలని భారత్‌కు రష్యా బిగ్ ఆఫర్ ఇచ్చింది. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో అంతర్జాతీయ వార్తాసంస్థల ప్రతినిధులతో జరిగిన ముఖాముఖి సమావేశంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. రక్షణ రంగంలో భారత్-రష్యా మధ్య ఉన్న బంధం కేవలం వ్యాపార సంబంధం కాదని, అది అత్యంత విశ్వసనీయమైన వ్యూహాత్మక భాగస్వామ్యమని ఆయన పునరుద్ఘాటించారు.

**మోదీపై ఒత్తిడి తేవడం ఎవరివల్లా కాదు!**

ఈ సందర్భంగా పాశ్చాత్య దేశాల తీరుపై పుతిన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ వేదికలపై భారత్‌ను తమ వైపు తిప్పుకోవడానికి కొన్ని దేశాలు ఒత్తిడి తెస్తున్నప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారత్ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరిస్తోందని కొనియాడారు. "భారత్‌పై లేదా ప్రధాని నరేంద్ర మోదీపై ఒత్తిడి తీసుకురావాలని ప్రయత్నించడం అంతర్జాతీయ, ద్వైపాక్షిక సంబంధాలకు హానికరమని అందరికీ తెలుసు. భారత్ తన జాతీయ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యత ఇస్తుంది" అని పుతిన్ స్పష్టం చేశారు.

**వ్యూహాత్మకంగా భారత్‌కు ఎందుకంత ముఖ్యం?**

ప్రస్తుతం భారత వైమానిక దళం ఆధునీకరణ దిశగా అడుగులు వేస్తోంది. అయితే ప్రస్తుతం భారత సైన్యంలో పూర్తిస్థాయి ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానాలు లేవు. ఇదే సమయంలో పొరుగు దేశమైన పాకిస్థాన్, చైనాకు చెందిన షెన్ యాంగ్ జే-35 స్టెల్త్ ఫైటర్ జెట్లను కొనుగోలు చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. చైనా ఇప్పటికే తన జె-20 స్టెల్త్ విమానాలను సరిహద్దుల్లో మోహరించింది. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లో రష్యా నుంచి వచ్చిన సు-57 ఆఫర్ భారత్‌కు వ్యూహాత్మకంగా ఎంతో బలమైన ఆయుధంగా మారే అవకాశం ఉంది.

**గతం వర్సెస్ వర్తమానం.. సు-57 ప్రాజెక్ట్ చరిత్ర**

నిజానికి సు-57 ప్రాజెక్ట్ భారత్‌కు కొత్తదేమీ కాదు. గతంలో రష్యాతో కలిసి 'ఫిఫ్త్ జనరేషన్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్' ప్రాజెక్టులో భారత్ భాగస్వామిగా ఉండేది. కానీ 2018లో సాంకేతిక విభేదాలు, విమాన సామర్థ్యాలపై భారత వైమానిక దళం కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఈ ప్రాజెక్ట్ నుండి తాత్కాలికంగా వైదొలిగింది. అయితే ప్రస్తుత భద్రతా సవాళ్లు చైనా-పాక్ కూటమి ముప్పు నేపథ్యంలో రష్యా ఈ విమానానికి సంబంధించిన కీలక సాంకేతికతలను పూర్తిగా బదిలీ చేయడానికి అంగీకరిస్తే భారత్ ఈ ప్రతిపాదనను మళ్లీ పరిశీలించే అవకాశం ఉందని రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**మేక్ ఇన్ ఇండియా వర్సెస్ రష్యా ఆఫర్**

ప్రస్తుతం భారత్ స్వదేశీ సాంకేతికతతో అధునాతన మధ్యశ్రేణి యుద్ధ విమానం (ఏఎంసీఏ) అనే ఐదో తరం యుద్ధ విమాన ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తోంది. ఈ ఏఎంసీఏ ప్రాజెక్ట్ ప్రస్తుతం కీలక దశలో ఉంది. ఇది పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడానికి 2030వ దశకం మధ్య నాటికి సమయం పడుతుంది. ఈ లోపు ఏర్పడే రక్షణ లోటును భర్తీ చేయడానికి రష్యా సు-57 ఆఫర్ పనికొస్తుందా? లేదా స్వదేశీ ఏఎంసీఏ ప్రాజెక్టుకే భారత్ మొగ్గు చూపుతుందా? అనేది ఇప్పుడు రక్షణ వర్గాలలో ఆసక్తికర చర్చకు దారితీసింది.

**చైనా వివాదంపై రష్యా తటస్థం**

భారత్-చైనా సరిహద్దు వివాదాలపైనా పుతిన్ స్పష్టతనిచ్చారు. ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యల్లో రష్యా జోక్యం చేసుకోదని భారత్-చైనాలు అత్యంత బాధ్యతాయుతమైన దేశాలని ఆయన పేర్కొన్నారు. ఇరు దేశాల నాయకత్వాలు పరస్పర చర్చల ద్వారానే సరిహద్దు సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోగలవనే నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. రష్యా అందించిన ఈ సరికొత్త రక్షణ ఆఫర్‌పై న్యూఢిల్లీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది రాబోయే రోజుల్లో అంతర్జాతీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకోనుంది.

# మండుటెండలో ఐదున్నర కిలో మీటర్లు సైకిల్ తొక్కిన బాబు.. రీజనేంటి?



సైకిలింగ్ అనేది జీవన విధానం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పిలుపునిచ్చారు. విశాఖ పర్యటనలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖలో ముఖ్యమంత్రి మండు టెండలో ఐదున్నర కిలో మీటర్లు సైకిల్ తొక్కి ఆదర్శంగా నిలిచారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి నొవాటెల్ హోటల్ వరకు సైకిల్ తొక్కుకుంటూ వచ్చారు. దీనికి ముందు.. వర్సిటీ క్యాంపస్ లో మొక్కను నాటారు. ఇది ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపు మేరకు ఆయన పాటించారు.

మొక్కకు -అమ్మణమ్మ-(చంద్రబాబు మాతృమూర్తి)గా పేరు పెట్టారు. అనంతరం ముఖ్యమంత్రి మీడియా తో మాట్లాడుతూ.. విశాఖలో ప్రత్యేకంగా సైకిలింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విశాఖలో 50 శాతం గ్రీనరీ పెంచేలా చర్యలు చేపడతున్నామన్నారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు పోర్టు దగ్గర నుంచి అన్ని వ్యవస్థల్లోనూ చర్యలు తీసుకుంటామన్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఇప్పటికే 5,18000 రూపాయల విలువైన విద్యుత్‌ను ఆదా చేశామన్నారు.

కాగా.. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా శుక్రవారం జరుపుకుంటున్నారు. ప్రకృతి స్ఫూర్తితో.. వాతావరణం కోసం,మన భవిష్యత్తు కోసం- అనే ఇతివృత్తంతో ఈ ఏడాది పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రకృతిని పరిరక్షించవలసిన ఆవశ్యకత పట్ల ప్రజలలో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఐక్య రాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్నిజరుపుకుంటున్నారు.అడవుల నరికివేత, వాహనాల కాలుష్యం , ప్లాస్టిక్ ను ఎక్కువగా వినియోగించడం, పంట భూముల్లో మోతాదుకు మించి ఎరువుల వినియోగం వంటి కారణాల వల్ల వాతావరణం కలుషితమై పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను విరివిగా పెంచి వాహనాలను, విద్యుత్ ను పరిమితంగా వినియోగించి ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని, ఈ దిశగా అందరూ కృషి చేయాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు.

**మైలవరంలో పవన్**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మైలవరం నియోజకవర్గంలో పర్యటించారు. ఇక్కడి పార్కులో మొక్కలు నాటారు. పచ్చదనం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అటవీ శాఖ మంత్రి కూడా అయిన పవన్ కల్యాణ్.. రాష్ట్రంలో అటవీ సంపదను పరిరక్షిస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరిట ఒక మొక్క నాటితే.. చాలని ఆయన పిలుపునిచ్చారు.

# లోకేశ్ 'జీరో రైస్' ఫిట్‌నెస్.. ఎన్ని కిలోలు తగ్గారంటే..?



తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఆంధ్రప్రదేశ్ ఐటీ, హెచ్‌ఆర్డీ మంత్రి నారా లోకేశ్ లుక్‌లో ఊహించని మార్పు కనిపిస్తోంది. ప్రతిపక్షంలో ఉండగా చేపట్టిన 'యువగళం' పాదయాత్రకు ముందు నుంచే బాడీ ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన లోకేశ్, ఈ మధ్య మరీ స్లిమ్‌గా మారిపోయారని అంటున్నారు. అంతేకాదు మునుపటి కంటే చాలా యాక్టివ్‌గా కనిపిస్తున్నారని ప్రశంసలు అందుకుంటున్నారు. ఒకప్పుడు చాలా బొద్దుగా ఉండే లోకేశ్ ఏకంగా 30 కిలోల బరువు తగ్గారు. దీనికోసం ఆయన సెపరేట్ డైట్ ప్లాన్ చేసుకున్నారు. తన వెయిట్ లాస్ సీక్రెట్ ను యువనేత తాజాగా బయటపెట్టారు. దీంతో జంక్ ఫుడ్, ఊబకాయం సమస్యలతో సతమతమవుతున్న యువతీయువకులు లోకేశ్ డైట్ సీక్రెట్ గురించి విస్తృతంగా చర్చించుకుంటున్నారు.

**లోకేశ్ కామెంట్స్ వైరల్**

సాధారణంగా బరువు తగ్గాలనుకునే వారు అన్నం పరిమాణాన్ని తగ్గిస్తారు. కానీ లోకేశ్ ఏకంగా రైస్‌కు పూర్తిగా దూరమయ్యారు. తాజాగా తన డైట్ ప్లాన్‌పై స్పందించిన లోకేశ్.. "నేనసలు రైస్ తినను, జీరో రైస్" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే అన్నం తన ఆహార జాబితా నుంచి పూర్తిగా తొలగించడమే తన తాజా వెయిట్ లాస్ వెనుక ఉన్న ముఖ్య కారణమని ఆయన స్పష్టం చేశారు. అధిక బరువు సమస్యను ఎప్పుడో అధిగమించినప్పటికీ, ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలనే ఆలోచనతోనే ఆయన ఈ సరికొత్త 'జీరో రైస్' డైట్‌ను ఫాలో అవుతున్నట్లు చెబుతున్నారు.

**'వన్ మీల్ ఏ దే' ఫార్ములా**


లోకేశ్ తన బరువును, ఫిట్‌నెస్‌ను అదుపులో ఉంచుకోవడానికి కొన్నాళ్లుగా 'ఇంటర్మీటెంట్ ఫాస్టింగ్' అనే ప్రసిద్ధ పద్ధతిని అనుసరిస్తున్నారు. తన బిజీ షెడ్యూల్‌ను బట్టి ఆయన రోజులో 16:8 లేదా 18:6 ఫాస్టింగ్ పద్ధతులను పాటిస్తున్నారని చెబుతున్నారు. అంటే రోజులో 16 నుంచి 18 గంటల పాటు ఏమీ తినకుండా కఠినమైన ఉపవాసం ఉంటూ, మిగిలిన 6 నుంచి 8 గంటల వ్యవధిలో మాత్రమే ఆహారం తీసుకుంటారు. ఇందులో భాగంగానే ఆయన 'వన్ మీల్ ఏ డే' విధానాన్ని ఎంచుకున్నట్లు చెబుతున్నారు. రోజుకు కేవలం ఒక్క పూట మాత్రమే ఆహారం తీసుకుంటూ తన బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ)ను సమతుల్యంగా ఉంచుకుంటున్నారు. అయితే, ఆ ఒక్క పూట తినే భోజనంలో రైస్ లేకుండా చూసుకుంటూ.. శరీరానికి కావలసిన ప్రోటీన్లు, విటమిన్లు, ఫైబర్ సమృద్ధిగా ఉండేలా పక్కాగా ప్లాన్ చేసుకుంటున్నారని చెబుతున్నారు.

**నిపుణులు ఏమంటున్నారు?**

ఖఇక లోకేశ్ డైట్ ప్లాన్ పై నిపుణులు కూడా పాజిటివ్ గానే స్పందిస్తున్నారు.

ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్, జీరో రైస్ డైట్ వల్ల శరీరంలో మెటబాలిజం అద్భుతంగా మెరుగుపడుతుందని, బరువు తగ్గడానికి ఇది అత్యంత వేగవంతమైన, సురక్షితమైన మార్గమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే, రోజుకు ఒక్క పూటే భోజనం చేసేటప్పుడు ఆ ఆహారంలో శరీరానికి కావలసిన అన్ని రకాల పోషకాలు, ఖనిజాలు ఉండేలా చూసుకోవాలని, లేదంటే నీరసం లేదా పోషకాహార లోపం వచ్చే ప్రమాదం ఉంటుందని సూచిస్తున్నారు.

# లోకేశ్ 'జీరో రైస్' ఫిట్‌నెస్.. ఎన్ని కిలోలు తగ్గారంటే..?



తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఆంధ్రప్రదేశ్ ఐటీ, హెచ్‌ఆర్డీ మంత్రి నారా లోకేశ్ లుక్‌లో ఊహించని మార్పు కనిపిస్తోంది. ప్రతిపక్షంలో ఉండగా చేపట్టిన 'యువగళం' పాదయాత్రకు ముందు నుంచే బాడీ ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన లోకేశ్, ఈ మధ్య మరీ స్లిమ్‌గా మారిపోయారని అంటున్నారు. అంతేకాదు మునుపటి కంటే చాలా యాక్టివ్‌గా కనిపిస్తున్నారని ప్రశంసలు అందుకుంటున్నారు. ఒకప్పుడు చాలా బొద్దుగా ఉండే లోకేశ్ ఏకంగా 30 కిలోల బరువు తగ్గారు. దీనికోసం ఆయన సెపరేట్ డైట్ ప్లాన్ చేసుకున్నారు. తన వెయిట్ లాస్ సీక్రెట్ ను యువనేత తాజాగా బయటపెట్టారు. దీంతో జంక్ ఫుడ్, ఊబకాయం సమస్యలతో సతమతమవుతున్న యువతీయువకులు లోకేశ్ డైట్ సీక్రెట్ గురించి విస్తృతంగా చర్చించుకుంటున్నారు.

**లోకేశ్ కామెంట్స్ వైరల్**

సాధారణంగా బరువు తగ్గాలనుకునే వారు అన్నం పరిమాణాన్ని తగ్గిస్తారు. కానీ లోకేశ్ ఏకంగా రైస్‌కు పూర్తిగా దూరమయ్యారు. తాజాగా తన డైట్ ప్లాన్‌పై స్పందించిన లోకేశ్.. "నేనసలు రైస్ తినను, జీరో రైస్" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే అన్నం తన ఆహార జాబితా నుంచి పూర్తిగా తొలగించడమే తన తాజా వెయిట్ లాస్ వెనుక ఉన్న ముఖ్య కారణమని ఆయన స్పష్టం చేశారు. అధిక బరువు సమస్యను ఎప్పుడో అధిగమించినప్పటికీ, ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలనే ఆలోచనతోనే ఆయన ఈ సరికొత్త 'జీరో రైస్' డైట్‌ను ఫాలో అవుతున్నట్లు చెబుతున్నారు.

**'వన్ మీల్ ఏ దే' ఫార్ములా**

లోకేశ్ తన బరువును, ఫిట్‌నెస్‌ను అదుపులో ఉంచుకోవడానికి కొన్నాళ్లుగా 'ఇంటర్మీటెంట్ ఫాస్టింగ్' అనే ప్రసిద్ధ పద్ధతిని అనుసరిస్తున్నారు. తన బిజీ షెడ్యూల్‌ను బట్టి ఆయన రోజులో 16:8 లేదా 18:6 ఫాస్టింగ్ పద్ధతులను పాటిస్తున్నారని చెబుతున్నారు. అంటే రోజులో 16 నుంచి 18 గంటల పాటు ఏమీ తినకుండా కఠినమైన ఉపవాసం ఉంటూ, మిగిలిన 6 నుంచి 8 గంటల వ్యవధిలో మాత్రమే ఆహారం తీసుకుంటారు. ఇందులో భాగంగానే ఆయన 'వన్ మీల్ ఏ డే' విధానాన్ని ఎంచుకున్నట్లు చెబుతున్నారు. రోజుకు కేవలం ఒక్క పూట మాత్రమే ఆహారం తీసుకుంటూ తన బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ)ను సమతుల్యంగా ఉంచుకుంటున్నారు. అయితే, ఆ ఒక్క పూట తినే భోజనంలో రైస్ లేకుండా చూసుకుంటూ.. శరీరానికి కావలసిన ప్రోటీన్లు, విటమిన్లు, ఫైబర్ సమృద్ధిగా ఉండేలా పక్కాగా ప్లాన్ చేసుకుంటున్నారని చెబుతున్నారు.

**నిపుణులు ఏమంటున్నారు?**

ఇక లోకేశ్ డైట్ ప్లాన్ పై నిపుణులు కూడా పాజిటివ్ గానే స్పందిస్తున్నారు. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్, జీరో రైస్ డైట్ వల్ల శరీరంలో మెటబాలిజం అద్భుతంగా మెరుగుపడుతుందని, బరువు తగ్గడానికి ఇది అత్యంత వేగవంతమైన, సురక్షితమైన మార్గమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే, రోజుకు ఒక్క పూటే భోజనం చేసేటప్పుడు ఆ ఆహారంలో శరీరానికి కావలసిన అన్ని రకాల పోషకాలు, ఖనిజాలు ఉండేలా చూసుకోవాలని, లేదంటే నీరసం లేదా పోషకాహార లోపం వచ్చే ప్రమాదం ఉంటుందని సూచిస్తున్నారు.

# కాక్రోచ్ పార్టీ నేత భావోద్వేగ ట్వీట్.. రేపు ఢిల్లీకి అభిజిత్ రాక



సోషల్ మీడియా సంచలనం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే శనివారం ఢిల్లీకి రానున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఎక్స్ లో ఆయన ట్వీట్ చేశారు. 'ఇండియాకి వస్తున్నా.. నా భవిష్యత్తును రాజ్యాంగం చేతుల్లో పెడుతున్నా' అన్న రాస్తూ ఢిల్లీలో నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీడియో రిలీజ్ చేశారు. దేశ విద్యావ్యవస్థలో చోటుచేసుకుంటున్న లోపాలను నిరసిస్తూ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ ఆందోళనకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు డిజిటల్ స్క్రీనుకి పరిమితమైన కాక్రోచ్ జనతా పార్టీ తొలిసారిగా ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవడం దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతోంది. డిజిటల్ మాధ్యమాల్లో కాక్రోచ్ పార్టీకి సుమారు రెండు కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఈ సంఖ్య దేశంలోని బలమైన జాతీయ పార్టీలుగా ఉన్న బీజేపీ, కాంగ్రెస్ కన్నా ఎక్కువగా కావడం విశేషం. జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీకులు, విద్యార్థుల డేటా బహిర్గతం కావడం వంటి సమస్యలపై కాక్రోచ్ పార్టీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు సోషల్ మీడియాలో వ్యంగ్య మీమ్స్ వదలిని కాక్రోచ్ పార్టీ కార్యకర్తలు తొలిసారిగా ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమయ్యారని అంటున్నారు.

ఇక 6న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు ప్లాన్ చేసిన కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే తాను ఇండియా వస్తున్నట్లు నాలుగు రోజుల క్రితమే ప్రకటించాడు. అంతేకాకుండా ఢిల్లీలో నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమం విజయవంతం చేయడానికి ముగ్గురు అధికార ప్రతినిధులను నియమించాడు. మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన ఆందోళనల్లో పాల్గొంటామని ప్రముఖ సినీ నటుడు ప్రకాష్ రాజ్ తోపాటు సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో కాక్రోచ్ పార్టీ కార్యక్రమంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు ఒకపక్క ఏర్పాట్లు జరుగుతుండగా, ఈ రోజు ఉదయం అభిజిత్ మరో ట్వీట్ చేశారు. 6వ తేదీ (శనివారం) ఢిల్లీ విమానాశ్రయంలో దిగుతాను అని, అక్కడి నుంచి నేరుగా పార్లమెంటు స్ట్రీట్ పోలీసు స్టేషన్ కి వెళ్లి శాంతియుత ఆందోళనకు అనుమతి ఇవ్వాలని కోరనున్నట్లు ప్రకటించాడు. దీంతో పోలీసులు అనుమతిస్తారా? లేదా? అన్నదే ఉత్కంఠకు గురిచేస్తోంది. విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్ నుంచి వెనక్కి తగ్గని కాక్రోచ్ పార్టీ ఆందోళనలకు ఎంతమంది వస్తారనేది కూడా సస్పెన్స్ గా మారింది. ఈ పరిస్థితుల్లో రేపు ఉదయం ఢిల్లీలో చోటుచేసుకునే రాజకీయ పరిణామాలు తీవ్ర ఉత్కంఠతోపాటు మరింత ఆసక్తిని కలిగిస్తున్నాయని అంటున్నారు.

# మీ కార్డులో డబ్బులు ఉంటాయ్..ఏటీఎంలోనే ఉండవ్..
# ATM సెంటర్లు మూతబడుతున్నాయా..?

దేశవ్యాప్తంగా ఏటీఎం సెంటర్లు నగదు కొరత కారణంగా మూతపడే ప్రమాదం ఉందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఏటీఎం ఇండస్ట్రీ హెచ్చరించింది. బ్యాంకుల నుంచి నగదు తీసుకోవడంలో ఏటీఎం ఆపరేటర్లు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని క్యాట్మీ (CATMi) ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (IBA)కు ఇప్పటికే లేఖ రాసింది. ఈ విషయాన్ని.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కరెన్సీ మేనేజ్‌మెంట్ విభాగానికి కూడా తెలియజేశారు.

ఈ కారణంగా దేశంలో ఏటీఎం సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఏటీఎం ఇండస్ట్రీ (జాూవీఴ) తెలిపింది. ఈ ప్రభావం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే డెబిట్ కార్డ్ వినియోగదారులపై ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఏటీఎం ఆపరేటర్లకు దేశవ్యాప్తంగా ఉన్న ఏటీఎంల్లో నగదు లోడింగ్ కోసం సుమారు నెలకు రూ. 94 వేల కోట్లు అవసరం పడ్డాయి. అయితే.. మార్చిలో రూ. 61 వేల కోట్లు, ఏప్రిల్?లో రూ. 54 వేల కోట్లు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. దీని ఫలితంగా.. నగదు లభ్యత స్థాయి అవసరాల కంటే చాలా దారుణంగా పడిపోయింది.



ఇలా.. నగదు కొరతతో పాటు, పెరుగుతున్న ఇంధన ధరలు, లావాదేవీల పరిమాణంలో తీవ్ర క్షీణత కారణంగా ఏటీఎం ఆపరేటర్లు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఎక్కువ మంది వినియోగదారులు డిజిటల్ చెల్లింపులకే మొగ్గు చూపుతున్నారు. దీంతో.. ఏటీఎంల వాడకం ఊహించిన దానికంటే గణనీయంగా తగ్గింది.కరెన్సీ చలామణిలో వృద్ధి కొనసాగుతున్నప్పటికీ.. గత ఏడాది కాలంలో ఏటీఎం లావాదేవీలు గణనీయంగా తగ్గాయని రిజర్వ్ బ్యాంక్ డేటా స్పష్టం చేసింది. నగదు సరఫరా సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే.. అనేక ప్రాంతాలలో ఏటీఎంల్లో నగదు దొరకకపోవచ్చని.. లక్షలాది మంది వినియోగదారులపై ఈ ప్రభావం పడుతుందని క్యాట్మీ (జాూవీఴ) హెచ్చరించింది.

# AI కారణంగా జాబ్ పోయింది.. ఛాలెంజ్ చేసి మరీ ఏఐ జాబ్ కొట్టాడు.. జీతం చూస్తే వావ్ అనాల్సిందే !

ఎక్కడ పోగొట్టుకున్నామో.. అక్కడే వెతుక్కోవాలి.. అనే సామెతను బాగా ఒంటబట్టించుకున్నట్లుంది ఈ ఒరాకిల్ టెకీ. ఏఐ కారణంగా ఉద్యోగం పోయిందని.. ఏకంగా ఏఐని ఛాలెంజ్ చేసి.. ఏఐ ఉద్యోగం కొట్టాడు. అది కూడా పాత కంపెనీతో పోల్చితే బెస్ట్ శాలరీతో ఇప్పుడు టాక్ ఆఫ్ ది టెక్ ఇండస్ట్రీ అయ్యాడు ఈ ఒరాకిల్ ఉద్యోగి. ఉద్యోగం పోయిందని బాధ పడకుండా.. కసిగా కొత్త టెక్నాలజీ నేర్చుకుని.. కేవలం 45 రోజుల్లో మూడు ఉద్యోగాలు సంపాదించాడు. పాత కంపెనీతో పోల్చితే 20 శాతం హైక్ తో ఏఐ ఇంజినీర్ గా ఉద్యోగంలో చేరాడు. ఒరాకిల్ కంపెనీకి చెందిన సాఫ్ట్ వేర్ ఇంజినీర్ 2026 మార్చి 31న లేఆఫ్ కు గురయ్యాడు. రెండేళ్ల ఎక్స్ పీరియెన్స్ ఉన్న తను.. వేల మంది ఉద్యోగుల్లో ఒకడిగా లేఆఫ్ అయినట్లు రెడిట్ లో పోస్ట్ చేశాడు. ఉద్యోగం పోయింది.. నేను చాలా కూల్ గా ఉండేవాడిని.. జాబ్ పోయిన తర్వాత ప్రిపేరేషన్ మోడ్ లోకి వెళ్లిపోయాను. నన్ను నేను లాక్ చేసుకున్నాను.. అంటూ పోస్టులో పేర్కొన్నాడు.



**ఇది ప్రిపేరేషన్ అంటే..**

ఏఐ కారణంగా జాబ్స్ పోతున్నాయని.. ఏఐ జాబ్ నే టార్గెట్ గా పెట్టుకున్నాడు. అందుకోసం రోజు 3 నుంచి 4 గంటలు డేటా స్ట్రక్చర్, ఆల్గారిథమ్ ప్రాక్టీస్ చేసేవాడు. దీనికి తోడు ఓ రెండు గంటలు ఏఐ కాన్సెప్టులు చదివేవాడట. తన స్కిల్స్ చూయించుకునేందుకు ప్రాజెక్ట్స్ తయారు చేసుకుని పెట్టుకున్నాడట. జాబ్ వేటను.. ఫుల్ టైమ్ టాస్క్ లా భావించి.. ప్రతిరోజు 10--15 జాబ్స్ కు అప్లై చేసుకునేవాడట. LinkedIn, Wellfound, Naukri, Indeed వంటి ప్లాట్ ఫామ్స్ లో అప్లై చేస్తూ.. రెగ్యులర్ గా ప్రొఫైల్ అప్డేట్ చేసేవాడు. కొన్ని వారాల్లోనే రిక్రూటర్లు ఇతన్ని రీచ్ అయ్యారట.

లింక్డ్ ఇన్ ద్వారానే ఏకంగా 20 మంది రిక్రూటర్ల వచ్చినట్లు చెప్పాడు. లింక్డ్ ఇన్ ప్రీమియమ్ చాలా హెల్ప్ చేసిందని చెప్పుకొచ్చాడు. మే తొలి వారం నుంచి మే నెల సగం అయ్యే వరకు ఇంటర్వ్యూలు ఇస్తూ వచ్చాను.. 7 కంపెనీలు ఇంటర్వ్యూ చేస్తే కొన్ని ఫెయిల్ అయ్యాను.. అందులో 3 ఆఫర్లు సంపాదించాను.. ఫైనల్ గా ఏఐ ఇంజినీర్ గా జాయిన్ అవబోతున్నాను.. అంటూ రెడిట్ లో పోస్ట్ చేశాడు.

**ఆన్ లైన్ లో బిగ్ డిబేట్:**

ఈ ఒరాకిల్ మాజీ ఉద్యోగి ఛాలెంజ్ ను, డెడికేషన్ ను నెటిజన్లు మెచ్చుకుంటున్నారు. చాలా ఇన్ స్పిరేషన్ అని కొందరు ప్రశంసించారు. నిరంతర ప్రిపేరేషన్ తో, మార్కెట్ లో ఉన్న అనిశ్చితిని అధిగమించవచ్చునని నిరూపించారని కామెంట్ చేస్తున్నారు. ఇంత త్వరగా కోలుకోవడం ఒక వరం అంటూ ఒక ఉద్యోగి అనగా.. ఇది చాలా ఆశ్చర్యంగా, విచిత్రంగా ఉందని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు.


ఇది వినటానికి బాగుంది. కానీ చాలా మంది ఇంత ఒత్తిడిని తట్టుకోలేరు.టెక్ ఇండస్ట్రీలో గ్రైండ్ కల్చర్ పెరిగిపోతుందని అనటానికి ఇది ఒక ఉదాహరణ అంటూ కొందరు కామెంట్స్ చేశారు. గ్రైండ్ కల్చర్ అంటే ఒత్తిడిలో నలిగిపోతూ.. తయారవటం. కొందరు భిన్నంగా రెస్పాండయ్యారు. మిత్రులారా, సాధారణ టైర్ 3 ఉద్యోగులకు మార్కెట్ ఇంకా అంత బాగాలేదు. అతడు టాప్ టీఴ నుండి వచ్చాడు.. రెజ్యూమేలో ఒరాకిల్ ఉంది .. అందుకే తొందరగా మరో జాబ్ కొట్టడలిగాడని ఒకరు అన్నారు.

మీకు జాబ్ రావటంపై ఎలాంటి అసూయ లేదు. మీకు కంగ్రాట్స్.. కానీ నాలాంటి చాలా మంది, ఆరు నెలల కంటే ఎక్కువ కాలం ఉద్యోగం లేకుండా నిరుత్సాహానికి గురై, తమను తామే ప్రశ్నించుకుంటున్న పరిస్థితి. అసలు సమస్య ఏంటంటే, ఈ రోజుల్లో కంపెనీలు టైర్ 1 అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. మా రెజ్యూమేలు షార్ట్‌లిస్ట్ కూడా కావడం లేదు. అంటూ మరొకరు రాసుకొచ్చారు.

తక్కువ సంవత్సరాల అనుభవం, తక్కువ జుజ కారణంగా, ఆ మాజీ ఒరాకిల్ టెక్నీషియన్ ఇతరుల కంటే సులభంగా ఉద్యోగం సంపాదించాడని కొందరు కామెంట్ చేశారు. చాలా వరకు 15 ఏళ్లకు పైగా అనుభవం ఉన్నవాళ్లు జాబ్ పోయిన తర్వాత ఆఫర్లు పొందడం చాలా కష్టంగా ఉంది. అని ఒక రెడ్డిట్ యూజర్ అన్నారు.

# విచ్చలవిడి ఏఐ వాడకంతో కరెంట్, నీటి కష్టాలు.. సంక్షోభంపై ఐక్యరాజ్య సమితి హెచ్చరిక

ప్రపంచాన్ని ప్రస్తుతం ఏఐ వేగంగా మార్చేస్తోంది. భవిష్యత్తులో ఏఐ మోడల్స్ మరింత సమర్థవంతంగా మారి తక్కువ ఎనర్జీని వినియోగిస్తాయని.. దాంతో పర్యావరణానికి ముప్పు తప్పుతుందని చాలామంది భావిస్తున్నారు. అయితే ఇదంతా ఒక పెద్ద భ్రమ అని ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక హెచ్చరించింది. సాంకేతికత పెరిగేకొద్దీ వనరుల వినియోగం తగ్గకపోగా.. మరింత పెరుగుతుందనే ఆర్థిక సూత్రం 'జెవాన్స్ పారడాక్స్' ఉచ్చులో ఏఐ చిక్కుకుందని ఐరాస స్పష్టం చేసింది. 19వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో బొగ్గు వాడకంపై ఆర్థికవేత్త విలియం స్టాన్లీ జెవాన్స్ చెప్పిన ఈ సిద్ధాంతం.. ఇప్పుడు ఏఐకి కూడా వర్తిస్తుందని పేర్కొంది. ఏఐ చౌకగా ఆకర్షణీయంగా మారే కొద్దీ దాని వాడకం విపరీతంగా పెరిగి, పర్యావరణాన్ని ముంచేస్తుందని హెచ్చరించింది.



**2030 నాటికి ప్రళయం:**

రాబోయే కొద్ది సంవత్సరాల్లో ఏఐ వల్ల పర్యావరణానికి జరగబోయే నష్టం ఊహాతీతమని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. 2030 నాటికి ఏఐ మోడల్స్, డేటా సెంటర్ల విద్యుత్ వినియోగం రెట్టింపై ప్రపంచ మొత్తం విద్యుత్‌లో 3 శాతానికి చేరుకుంటుందట. గత ఏడాదిలోనే ఇవి సౌదీ అరేబియా దేశం మొత్తం వాడే విద్యుత్ అంత పవర్‌ను మింగేశాయి. ఇక ఏఐ విడుదల చేసే కార్బన్ ఉద్గారాలను సమం చేయాలంటే 6.7 బిలియన్ల చెట్లను నాటి, పదేళ్ల పాటు పెంచాల్సి ఉంటుందట. ఇది యునైటెడ్ కింగ్‌డమ్ దేశం విడుదల చేసే మొత్తం ఉద్గారాలతో సమానం. అలాగే డేటా సెంటర్లను చల్లబరచడానికి ఏకంగా 9.3 ట్రిలియన్ లీటర్ల నీరు అవసరమవుతుంది. ఇది ప్రపంచ జనాభా మొత్తానికి ఏడాది పాటు అవసరమయ్యే తాగునీటి కంటే ఎక్కువనే. ఈ డేటా సెంటర్ల కోసం మెక్సికో సిటీ కంటే 10 రెట్లు పెద్దదైన స్థలం అవసరమవుతుందని రిపోర్ట్ బయటపెట్టింది.

**ఏఐ బూమ్ లో దాగి ఉన్న వివక్ష..**


ఈ ఏఐ విప్లవం వెనుక తీవ్రమైన అంతర్జాతీయ వివక్ష దాగి ఉందని ఐరాస వేలెత్తి చూపింది. ప్రపంచవ్యాప్తంగా కేవలం 32 దేశాల్లో మాత్రమే ఏఐ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉంది. అందులోనూ 90 శాతం సామర్థ్యం కేవలం అమెరికా, చైనాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉంది. ఏఐ సాంకేతికతను సృష్టించి, శాసించే దేశాలు ఒకవైపు ఉంటే.. కేవలం వాటిని వాడుకునే పేద దేశాలు మరోవైపు ఉన్నాయి. అయితే ఈ ఏఐ తయారీకి కావాల్సిన మైనింగ్, ఈ-వేస్ట్ వంటి పర్యావరణ భారాలన్నింటినీ ఈ పేద దేశాలే మోయాల్సి వస్తోందని ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది.

**సస్టైనబుల్ టెక్నాలజీ అవసరం..**

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాలు తమ ప్రభుత్వ సేవల్లో ఏఐ వాడకాన్ని పెంచుతున్నప్పటికీ.. పర్యావరణ పరిణామాలపై స్పష్టమైన నిబంధనలు, పర్యవేక్షణ లేదు. టెక్నాలజీ బాగుంది కదా అని ప్రకృతిని పణంగా పెట్టలేం. కాబట్టి ఇప్పటికైనా పారదర్శకత, గ్లోబల్ కోఆపరేషన్, సస్టైనబుల్ యూజ్ అనే సూత్రాలతో కూడిన రోడ్‌మ్యాప్‌ను ఐరాస ప్రతిపాదించింది. ఏఐ వల్ల పర్యావరణానికి

జరిగే నష్టాన్ని అధికారికంగా వెల్లడించే విధానాన్ని ప్రతీ దేశం తీసుకురావాలని, ప్రకృతిని కేంద్ర బిందువుగా చేసుకుని సరికొత్త 'ఇన్నోవేషన్ ప్లేబుక్' రాయాల్సిన సమయం ఆసన్నమైందని యునైటెడ్ నేషన్స్ పిలుపునిచ్చింది.

## ఆర్‌బీఐ కీలక నిర్ణయం.. నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించడంతో శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) నిర్ణయాల వెల్లడి అనంతరం ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ఫలితంగా, బీఎస్‌ఈ సెన్సెక్స్ 116.67 పాయింట్లు క్షీణించి 74,243.34 వద్ద ముగియగా, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 49.85 పాయింట్లు తగ్గి 23,366.70 వద్ద స్థిరపడింది. మూడు రోజుల సమీక్షా సమావేశం అనంతరం, రెపో రేటును 5.25 శాతం వద్దే స్థిరంగా ఉంచాలని ఎంపీసీ ఏకగ్రీవంగా తీర్మానించింది. అంతర్జాతీయ అనిశ్చితులు, దేశీయ వృద్ధికి సంబంధించిన ఆందోళనల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, పెరుగుతున్న ఇంధన ధరలు, రుతుపవనాలపై ఎల్ నినో ప్రభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఇదే క్రమంలో, 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఆర్బీఐ జీడీపీ వృద్ధి అంచనాను 6.6 శాతానికి తగ్గించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆహార ద్రవ్యోల్బణం వంటి సవాళ్లు వృద్ధికి ప్రతికూలంగా మారతాయని పేర్కొంది. అదేవిధంగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతంగా నమోదు కావొచ్చని అంచనా వేసింది. మరోవైపు, రూపాయి విలువను సుస్థిరం చేసేందుకు, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆర్‌బీఐ పలు కీలక చర్యలను ప్రకటించింది. ఇందులో భాగంగా ఎన్నారైలు, ఓసీఐల ఈక్విటీ పెట్టుబడి పరిమితులను పెంచడం, ప్రభుత్వ సెక్యూరిటీలలో మరిన్ని దీర్ఘకాలిక బాండ్లను చేర్చడం వంటి నిర్ణయాలు తీసుకుంది. ఈ సానుకూల ప్రకటనలతో ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి మారకం విలువ బలపడింది.

## విదేశీ ఇన్వెస్టర్లకు పన్నుల వాత నుంచి రిలీఫ్.. ఎట్టకేలకు కళ్లు తెరిచి ఆర్డినెన్స్ తెచ్చిన మోడీ సర్కార్




డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పాతాళానికి పడిపోతుండటం, విదేశీ పెట్టుబడులు దేశం దాటి వెళ్లిపోతుండటంతో ఎట్టకేలకు మోడీ సర్కార్ కళ్లు తెరిచింది. గతంలో పన్నులు పెంచి విదేశీ ఇన్వెస్టర్లను ఇబ్బంది పెట్టిన కేంద్ర ప్రభుత్వం.. తాము చేసిన తప్పును ఆలస్యంగానైనా తెలుసుకుని యు-టర్న్ తీసుకుంది. పార్లమెంట్ సమావేశాలు లేని సమయంలో అత్యవసరంగా రంగంలోకి దిగిన కేంద్రం.. జూన్ 5న'ఆదాయపు పన్ను (సవరణ) ఆర్డినెన్స్ 2026'ను జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేసిన ఈ ఆర్డినెన్స్ ద్వారా విదేశీ ఇన్వెస్టర్లకు పన్నుల నుంచి భారీ ఊరట లభించింది.

**నాడు పన్ను పెంచి తప్పు చేశారు..**

నిజానికి ప్రభుత్వ బాండ్లపై విదేశీ ఇన్వెస్టర్లు సంపాదించే వడ్డీ ఆదాయంపై గతంలో కేవలం 5 శాతం విత్‌హోల్డింగ్ ట్యాక్స్(ఴణూ) ఉండేది. అయితే 2023 జూలైలో మోడీ సర్కార్ ఒక వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. క్యాపిటల్ గెయిన్స్ పన్నులతో సమానంగా ఉంచాలనే నెపంతో ఆ పన్నును ఏకంగా 20 శాతానికి పెంచేసింది. దాంతో పాటు ప్రభుత్వ బాండ్లను ఏడాది కంటే ఎక్కువ కాలం ఉంచుకుంటే 12.5 శాతం లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ టాక్స్, ఏడాది లోపు అమ్మేస్తే 20 శాతం షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ టాక్స్ వసూలు చేయడం ప్రారంభించింది. ఈ భారీ పన్నుల వల్ల విదేశీ ఇన్వెస్టర్లు భారత్ నుంచి తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడం మొదలుపెట్టారు.

**అన్ని పన్నులూ రద్దు.. విదేశీయులకు రెడ్ కార్పెట్**

ఇప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకునేందుకు మోడీ సర్కార్ తమ పాత పన్ను నిర్ణయాలన్నింటినీ పూర్తిగా రద్దు చేసింది. తాజా ఆర్డినెన్స్ ప్రకారం.. విదేశీ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు( ప్రభుత్వ సెక్యూరిటీలు, బాండ్లపై సంపాదించే వడ్డీ ఆదాయంపై ఎలాంటి విత్‌హోల్డింగ్ ట్యాక్స్ చెల్లించాల్సిన అవసరం లేదు. అలాగే ఈ బాండ్ల అమ్మకం లేదా బదిలీ ద్వారా వచ్చే లాభాలపై క్యాపిటల్ గెయిన్స్ పన్నును పూర్తిగా ఎత్తేశారు. అంతర్జాతీయ కేంద్ర బ్యాంకుల ఫోరమ్ అయిన 'బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్' సంస్థకు కూడా ఇదే పన్ను మినహాయింపును వర్తింపజేశారు. ఈ సవరణలను 'ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్ 2025' లోని షెడ్యూల్ ×ఽ కు కొత్త కేటగిరీలుగా చేర్చారు.

**రెట్రోస్పెక్టివ్ ఎఫెక్ట్.. ఏప్రిల్ 1 నుంచే వర్తింపు**

ఈ నిర్ణయంలో మరో కీలకమైన అంశం ఏంటంటే.. ఈ ఆర్డినెన్స్ ప్రస్తుత పన్ను ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన 2026 ఏప్రిల్ 1 నుంచి పాత తేదీతో వర్తిస్తుండటమే. అంటే ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి విదేశీ ఇన్వెస్టర్లు ప్రభుత్వ బాండ్లపై ఆర్జించిన లాభాలు, వడ్డీలపై ఎలాంటి పన్నులు చెల్లించక్కర్లేదు. సో ఈ నిర్ణయంతో ఇన్నాళ్లుగా భారత మార్కెట్లలో పెట్టుబడులు అంటే పన్నుపోటు భయానికి గురైన విదేశీ ఇన్వెస్టర్లు తిరిగి డాలర్లు కుమ్మరించే రోజులు అతి దగ్గరలోనే ఉన్నాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అయితే జరగాల్సిన నష్టం జరిగాక ఆలస్యంగా మోడీ సర్కార్ కళ్లు తెరవటంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

# చికెన్‌లో నిమ్మరసం పిండుకుంటే..



చికెన్‌లో నిమ్మరసం పిండుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై చాలామందికి అనుమానాలున్నాయి. అయితే నిపుణుల అభిప్రాయం ప్రకారం.. చికెన్‌లో నిమ్మరసం కలుపుకోవడం ఆరోగ్యానికి మంచిది. నిమ్మలోని ఆమ్లత్వం చికెన్‌లోని ప్రొటీన్లను విచ్ఛిన్నం చేసి మాంసాన్ని మరింత మృదువుగా చేస్తుంది. సిట్రిక్ యాసిడ్ వల్ల ప్రొటీన్లు చిన్న కణాలుగా విడిపోయి, చికెన్ త్వరగా జీర్ణం అవ్వడానికి తోడ్పడుతుంది. చికెన్.. అనగానే.. నాన్‌వెజ్ ప్రియులు లొట్టలేసుకుంటూ మరి తింటారు.. చికెన్ లో ప్రొటీన్ తోపాటు ఎన్నో పోషకాలు దాగున్నాయి. అయితే.. చికెన్ కాంబినేషన్ విషయంలో జాగ్రత్తగా ఉండాలంటూ డైటీషియన్లు తరచూ హెచ్చరిస్తుంటారు. కోడి మాంసంతో కలిపి కొన్ని పదార్థాలను తినకూడదని.. దీనివల్ల అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చని పేర్కొంటున్నారు. అయితే.. చికెన్‌లో నిమ్మకాయ రసం పిండుకోవచ్చా లేదా అనే అనుమానం చాలామందిలో ఉంటుంది. చికెన్‌ను వండే ముందు మసాలాలు కలిపేటప్పుడు లేదా వండిన తర్వాత తినే సమయంలో నిమ్మరసాన్ని తరచుగా వాడుతుంటారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, చికెన్‌లో నిమ్మరసం పిండుకోవడం ఆరోగ్యానికి మంచిదే కాకుండా, అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ముఖ్యంగా, చికెన్‌లో నిమ్మరసం కలుపుకోవడం వల్ల అందులోని ఆమ్లత్వం ప్రొటీన్లను విచ్ఛిన్నం చేస్తుంది. నిమ్మలోని సిట్రిక్ యాసిడ్ కారణంగా ప్రొటీన్లు చిన్న చిన్న కణాలుగా విడిపోవడంతో, చికెన్ మరింత మృదువుగా తయారవుతుంది. ఇది ఆహారం తీసుకున్న తర్వాత చికెన్ త్వరగా జీర్ణం అవ్వడానికి గణనీయంగా ఉపయోగపడుతుంది. చికెన్ తినేటప్పుడు కొందరు జీర్ణ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటుంటారు. నిమ్మరసం పిండుకొని తినడం వల్ల ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. కొంతమంది చికెన్‌ను స్కిన్‌తో సహా తినడానికి ఇష్టపడతారు. అలాంటి వారికి కూడా నిమ్మరసం ప్రయోజనకరంగా ఉంటుంది. చికెన్ స్కిన్ నుంచి వచ్చే కొవ్వును సమతుల్యం చేయడంలో నిమ్మరసం సహాయపడుతుంది, తద్వారా శరీరంలో కొలెస్ట్రాల్ పెరగకుండా నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అదనంగా, చికెన్‌ను వండే ముందు మేరినేట్ చేసేటప్పుడు నిమ్మరసం కలుపుతారు. ఇది చికెన్ సరిగ్గా ఉడకడానికి దోహదపడుతుంది. నిమ్మలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. ఈ విటమిన్ సి, ఆహారం నుండి ఐరన్‌ను గ్రహించడానికి శరీరానికి అత్యవసరం. చికెన్‌లో లీన్ ప్రొటీన్, విటమిన్స్ బీ6, బీ12, ఐరన్ వంటి ఖనిజాలు ఉంటాయి. కాల్షియం కూడా చికెన్‌లో ఉంటుంది. వీటిని శరీరం సమర్థవంతంగా గ్రహించడానికి విటమిన్ సి అవసరం. అందువల్ల, చికెన్‌లో నిమ్మరసం కలుపుకోవడం వల్ల పోషక విలువలు మరింత పెరుగుతాయి. మొత్తంగా చూస్తే, చికెన్‌లో నిమ్మరసం కలుపుకోవడం వల్ల ఎలాంటి ప్రతికూల ప్రభావాలు ఉండవని, బదులుగా మాంసం మృదువుగా మారడం, జీర్ణక్రియ మెరుగుపడటం, కొలెస్ట్రాల్ నియంత్రణ, పోషకాల శోషణ పెరగడం వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలే కలుగుతాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.


# సవాళ్లను ఎదుర్కొంటేనే విజయం?



ప్రతిరోజూ ఉదయం నిద్రలేవగానే ఆ రోజు పూర్తి చేయాల్సిన పనుల గురించి మన మెదడు ఒక ప్రణాళికను సిద్ధం చేసుకుంటుంది. లక్ష్యం చిన్నదైనా పెద్దదైనా ఒకసారి నిర్ణయం తీసుకున్న తర్వాత విజయం లభించే వరకు అదే ఉత్సాహాన్ని, పట్టుదలను కొనసాగించడం చాలా ముఖ్యం. అప్పుడే మనం అనుకున్న గమ్యాన్ని చేరుకోగలం. జీవితంలో అడ్డంకులు ఎదురవ్వడం సహజం, మనం ఒకటి తలిస్తే దైవం మరొకటి తలచినట్లు పరిస్థితులు తారుమారు కావచ్చు. అటువంటి సమయాల్లో నిరాశ చెందకుండా పట్టుదలతో పోరాడి చిన్న అవకాశాన్ని కూడా వదులుకోకుండా ముందుకు సాగాలి. ఓటమి అంచుల్లో ఉన్నప్పుడు కూడా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే విజయం మన సొంతం అవుతుంది. జీవితంలో విజయం సాధించాలంటే కేవలం కలలు కనడం సరిపోదు, వాటిని నిజం చేసుకునే క్రమంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి. ఒక్కోసారి పరిస్థితులు అనుకూలించక అలసట కలగవచ్చు, కానీ ఆ సమయంలోనే మనలోని అంతర్గత శక్తిని బయటకు తీయాలి. గోమతి అనే మహిళ జీవితంలో జరిగిన సంఘటన దీనికి చక్కని ఉదాహరణగా నిలుస్తుంది.

ఆమె 1979లో మదురై కామరాజ్ యూనివర్సిటీలో డిగ్రీలో చేరారు. ఉత్సాహంగా చదువు మొదలుపెట్టిన కొద్ది రోజులకే అనారోగ్య సమస్యల వల్ల చదువు ఆపేయాల్సి వచ్చింది. ఒక ఏడాది వృథా అయిందని బాధపడుతున్న సమయంలో, యూనివర్సిటీ నుండి పొరపాటున వచ్చిన ఒక పరీక్షా దరఖాస్తు ఆమె జీవితాన్ని మార్చేసింది. ఆ అవకాశాన్ని వదులుకోకుండా భర్త అనుమతితో కేవలం మూడు నెలల కఠోర శ్రమతో పరీక్షలు రాసి విజయం సాధించారు. ఫలితంగా ఆమె అనుకున్నట్లుగానే పట్టభద్రురాలిగా గుర్తింపు పొందారు. మనకు ఎటువంటి ప్రతిభ లేదని చాలామంది ఫిర్యాదు చేస్తుంటారు, కానీ ప్రతి మనిషిలోనూ ఒక ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుంది. దానిని గుర్తించి అంకితభావంతో కృషి చేస్తే లక్ష్యం మన చెంతకు చేరుతుంది. ఏదైనా పనిని ప్రారంభంలో కష్టంగా అనిపించినా ఇష్టంతో చేయడం మొదలుపెడితే అందులో వేగంగా పురోగతి సాధించవచ్చు. లక్ష్య సాధనలో సమయం చాలా విలువైనది, అన్ని పనులను మనమే చేయాలని అనుకోకుండా బాధ్యతలను పంచుకోవడం వల్ల సమయం ఆదా అవుతుంది. జీవిత ప్రయాణంలో మనం తప్పుడు మార్గంలో వెళ్తున్నామని తెలిసిన వెంటనే సరిదిద్దుకోవాలి. తప్పుడు బస్సు ఎక్కామని తెలిసినప్పుడు తదుపరి స్టాప్‌లోనే దిగిపోవడం తెలివైన పని, లేదంటే మరింత సమయం వృథా అవుతుంది. అలాగే శారీరక దృఢత్వం కోరుకునే వారు బ్రహ్మ ముహూర్తంలో నిద్రలేచి నడకను అలవాటు చేసుకోవాలి. అది ఇంటిని శుభ్రం చేయడం వంటి చిన్న పని అయినా, ఇల్లు కట్టడం వంటి పెద్ద పని అయినా ఏకాగ్రతతో చేస్తే విజయం లభిస్తుంది. మీ లక్ష్యంపై దృష్టి సారించి ప్రపంచాన్ని జయించండి. నిరంతర కృషి, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడమే మిమ్మల్ని ఉన్నత స్థానంలో నిలబెడతాయి. మీ ప్రతిభను నమ్మి ఇష్టంతో పని చేయండి, విజయం మీ ముంగిట ఉంటుంది.


# జీన్స్‌ను ఎన్ని రోజులకోసారి ఉతకాలి



జీన్స్ ఒక స్టైలిష్, సౌకర్యవంతమైన వస్త్రం. పురుషులు, మహిళలూ.. చిన్నా పెద్దా అంతా జీన్స్ ను ఇష్టంగా ధరిస్తారు.. అయితే, వాటిని ఎప్పుడు ఉతకాలో చాలా మందికి గందరగోళంగా ఉంటుంది. జీన్స్.. జీన్స్.. జీన్స్.. చిన్నా పెద్దా అందరూ ఇష్టపడే.. స్టైలిష్, సౌకర్యవంతమైన వస్త్రం.. ఈ రోజుల్లో జీన్స్ కేవలం ఒక దుస్తువు మాత్రమే కాకుండా.. అవి ప్రతి ఒక్కరి దైనందిన జీవనశైలిలో ఒక అంతర్భాగంగా మారాయి. కాలేజీ అయినా, ఆఫీసు అయినా, లేదా సాధారణంగా బయటకు వెళ్ళినా, సరిగ్గా సరిపోయే ఒక జీన్స్ ప్యాంటు ప్రతి సందర్భంలోనూ స్టైల్, సౌకర్యం రెండింటినీ అందిస్తుంది. కానీ వాటిని తరచుగా లేదా తప్పుగా ఉతకడం అందరూ చేసే సాధారణ పొరపాటు.. ఇలా చేయడం వల్ల జీన్స్ దుస్తులు ముందుగానే చినిగిపోతాయి.. లేదా రంగు మారి పాలిపోయి కనిపిస్తుంది. చాలా మంది జీన్స్ వేసుకున్న ప్రతిసారీ ఉతకాలని అనుకుంటారు.. మరికొందరు వారాలు లేదా నెలల తరబడి వాటిని ఉతకకుండా ఉంటారు. నిజం ఏమిటంటే, జీన్స్ మన్నిక, ఫిట్, రంగును కాపాడుకోవడానికి వాటిని సరైన పద్ధతిలో జాగ్రత్తగా చూసుకోవడం, సరైన సమయంలో ఉతకడం చాలా కీలకం.. జీన్స్ ఇతర దుస్తుల కంటే చాలా దృఢంగా ఉంటాయి.. కానీ అంతమాత్రాన వాటిని ఎలా పడితే అలా ఉతకకూడదు. పదేపదే ఉతకడం వల్ల రంగు వెలిసిపోవడం, బట్ట వదులుగా మారడం, సరిగ్గా సరిపోకపోవడం జరగవచ్చు. నిజానికి, జీన్స్‌ను ఎప్పుడు ఉతకాలి అనేది.. మీరు వాటిని ఎంత తరచుగా ధరిస్తారు, వాతావరణం, మీరు వాటిని ఎంతగా వాడుతున్నారు వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఈ విషయంలో చాలా మంది ఫ్యాషన్ నిపుణులకు భిన్నమైన అభిప్రాయాలు ఉన్నప్పటికీ, బ్రిటిష్ ఫ్యాషన్ డిజైనర్, వ్యాపారవేత్త టాన్ ఫ్రాన్స్ ఒక ఇంటర్వ్యూలో తాను తన జీన్స్‌ను 20 సార్లు ధరించిన తర్వాత ఉతుకుతానని పేర్కొన్నారు. సాధారణంగా, జీన్స్‌ను 10 నుండి 12 సార్లు ధరించిన తర్వాత ఉతకాలి. అయితే, మేము ఇప్పటికే చెప్పినట్లుగా, మీరు జీన్స్ ధరించే కాలం కూడా ముఖ్యమైనదే. మీరు చాలా వేడిగా లేదా చెమట ఎక్కువగాం

ఉండే ప్రాంతంలో ఉన్నట్లయితే, వాటిని 2 నుండి 3 సార్లు ధరించిన తర్వాత ఉతకడం ఉత్తమం. శీతాకాలంలో, మీరు జీన్స్‌ను 7 నుండి 8 సార్లు ధరించిన తర్వాత ఉతకవచ్చు. తరచుగా ఉతకడం వల్ల రంగు వెలిసిపోవడానికి, బట్ట వదులుగా మారడానికి కారణమవుతుందని గుర్తుంచుకోండి.. కాబట్టి అవసరమైనప్పుడు మాత్రమే వాటిని ఉతకడం ఉత్తమం.

# క్యాన్సర్‌పై సరికొత్త అస్త్రాలు



క్యాన్సర్ చికిత్సలో అధునాతన శాస్త్రీయ పరిశోధనలు సరికొత్త ఆశలు రేపుతున్నాయి. ఆయా వ్యక్తుల స్వభావానికి సరిపోయే, కేవలం కణితుల మీదే దాడిచేసే వినూత్న చికిత్సలకు పురుడు పోస్తున్నాయి. ఒక్క రక్త నమూనాతోనే క్యాన్సర్ తీరుతెన్నులను పర్యవేక్షించగల పరీక్షలకూ వీలు కల్పిస్తున్నాయి. ఇవన్నీ క్యాన్సర్ అంటే ఒకప్పటిలా భయపడాల్సిన పనిలేదనే భరోసా ఇస్తున్నాయి. ఒకరకంగా క్యాన్సర్లనూ ఇతరత్రా దీర్ఘకాలిక సమస్యల మాదిరిగా మార్చేస్తున్నాయన్నా అతిశయోక్తి కాదు.

### టార్గెటెడ్ థెరపీ, డీగ్రేడేషన్ పరిజ్ఞానాలు

సంప్రదాయ కీమోథెరపీలు క్యాన్సర్ కణాలతో పాటు ఆరోగ్యకర కణాల మీదా దాడిచేస్తాయి. ఇది జుట్టు ఊడటం వంటి దుష్ప్రభావాలకు దారితీస్తుంటుంది. ఇక్కడే లక్షిత చికిత్సలు వరంగా ఆదుకుంటున్నాయి. ఇవి ఆయా క్యాన్సర్ కణాలను గుర్తించి, వాటి మీదే దాడి చేస్తాయి. వ్యాధి కారక ప్రొటీన్లను నిలువరించటమే కాదు, వాటిని పూర్తిగానూ నిర్మూలించగలవు.

ప్రొటాక్ (ప్రొటీయోలైసిస్ టార్గెటింగ్ కైమెర) పరిజ్ఞానం: ఇదో విప్లవాత్మక ఔషధ తయారీ విధానం. రెండు చిన్న అణువుల సాయంతో పనిచేస్తుంది. క్యాన్సర్ కారక ప్రొటీన్లను అడ్డుకోవటానికి బదులు వాటిని నిర్వీర్యం చేయటం దీని గొప్పతనం. ఇప్పటివరకూ మందులకు కొరుకుడు పడని వ్యాధి కారక ప్రొటీన్ల మీద దాడి చేయటానికిది వీలు కల్పిస్తోంది. యాంటీబాడీ–డ్రగ్ కాంజ్యుగేట్స్: వీటిని 'స్మార్ట్ బాంబు లింకులు' అనుకోవచ్చు. ఇవి ఆయా క్యాన్సర్ కణాలను లక్ష్యంగా చేసుకునే మోనోక్లోనల్ యాంటీబాడీనీ శక్తిమంతమైన కీమోథెరపీ మందునూ కలుపుతాయి. ఇలా ఆరోగ్య కణజాలానికి ఎలాంటి హాని కలగకుండా కేవలం కణితికే నేరుగా మందు చేరుకునేలా చేస్తాయి. పీఏఆర్‌పీ1 సెలెక్టివ్ ఇన్‌హిబిటార్స్: కేవలం పీఏఆర్‌పీ1 ఎంజైమ్ మీదే దాడిచేసే కొత్తతరం క్యాన్సర్ మందులివి. తొలితరం ఇన్‌హిబిటార్స్‌తో పోలిస్తే తక్కువ మోతాదులోనే సమర్థంగా పనిచేస్తాయి. ముఖ్యంగా డీఎన్‌ఏ మరమ్మతు లోపించిన క్యాన్సర్లకు (ఉదా: బ్రాకా మార్పులు గలవి) బాగా ఉపయోగపడతాయి. వీటితో రక్తహీనత, రక్తం గడ్డలు ఏర్పడటం వంటి దుష్ప్రభావాలూ తక్కువే.

మెనిన్ ఇన్‌హిబిటార్స్: తిరగబెట్టిన లేదా తీవ్ర రక్తక్యాన్సర్ల చికిత్సలో కొత్త ఆశలు రేపుతున్నాయి.

### అధునాతన ఇమ్యునోథెరపీ

క్యాన్సర్ చికిత్సలో ఇమ్యునోథెరపీ బ్రహ్మాస్త్రమే. ఇది క్యాన్సర్‌తో పోరాడేలా రోగనిరోధక వ్యవస్థను తీర్చిదిద్దుతుంది. క్యాన్సర్ కణాలను గుర్తించేలా శిక్షణ ఇవ్వటమే కాకుండా, నిర్మూలించేలా ప్రేరేపిస్తుంది కూడా. ఇమ్యునోథెరపీలో ఇప్పుడు అధునాతన పద్ధతులు మరింత భరోసా ఇస్తున్నాయి.

కార్–టీ, కార్–ఎన్‌కే చికిత్సలు: రక్తక్యాన్సర్ చికిత్సలో కైమెరిక్ యాంటీజెన్ రిసెప్టర్ (కార్) టీ–కణ చికిత్స విప్లవాత్మక మార్పులనే తీసుకొచ్చింది. ఇప్పుడిది జీర్ణాశయం, క్లోమం, కాలేయం, పెద్ద పేగు, ఊపిరితిత్తులు, చర్మం వంటి అవయవాలు, మృదుకణజాలాల్లో తలెత్తే గట్టి కణితుల చికిత్సకూ విస్తరిస్తోంది. కొత్త యాంటీజెన్ల మీద దాడి చేయటం, కార్ సహజ హంతక (ఎన్‌కే) కణాల సామర్థ్యాన్ని ఇనుమడింపజేయటం వీటి ప్రత్యేకత.

ట్యూమర్ ఇన్‌ఫిల్ట్రేటింగ్ లింఫోసైట్ (టీఐఎల్) థెరపీ: కణితిలోకి చొచ్చుకెళ్లిన రోగనిరోధక కణాలను సంగ్రహించి, ప్రయోగశాలలో పెద్దఎత్తున వృద్ధి చేయటం.. వాటిని తిరిగి క్యాన్సర్ బాధితుల శరీరంలోకి ప్రవేశపెట్టడం ఇందులోని కీలకాంశం. ఇది ఇతర భాగాలకు విస్తరించిన క్యాన్సర్లకు సమర్థంగా పనిచేస్తుంది. ఒక్కసారి చికిత్స చేస్తే చాలు.

కొత్త తరం ఇమ్యూన్ చెక్‌పాయింట్ ఇన్‌హిబిటార్స్: ట్జీ కణాల వంటి రోగనిరోధక కణాల మీద పీడీ–1 వంటి చెక్‌పాయింట్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక ప్రతిస్పందన మరీ అతిగా ప్రేరేపితం కాకుండా నిలువరిస్తుంటాయి. క్యాన్సర్ కణాలు వీటిని అనువుగా మలచుకొని, రోగనిరోధక వ్యవస్థ కంటపడకుండా తప్పించుకుంటాయి. ఇక్కడే ఇమ్యూన్ చెక్‌పాయింట్ ఇన్‌హిబిటార్స్ రకం మందులు ఆదుకుంటున్నాయి. టి కణాలను తిరిగి ప్రేరేపించి, క్యాన్సర్‌తో పోరాడేలా చేస్తాయి. ఇప్పుడు కొత్తతరం చెక్‌పాయింట్ ఇన్‌హిబిటార్స్ మరింత బలంగా పనిచేస్తున్నాయి. ఇవి పీడీ–1/పీడీ–ఎల్1తో పాటు ఎల్ఏజీ–3, టీఐజీఐటీ, టీఐఎం–3 వంటి కీలక ఇమ్యూన్ చెక్‌పాయింట్ గ్రాహకాల మీదా దాడి చేయగలవు. ఇలా కణితులకు సంప్రదాయ ఇమ్యునోథెరపీలను తట్టుకునే సామర్థ్యం అబ్బకుండా చేస్తాయి.

క్యాన్సర్ టీకాలు (ఎంఆర్ఎన్, నియో యాంటిజెన్): క్యాన్సర్ కణాలను గుర్తించి, నిర్మూలించే టీకా చికిత్సలివి. ఆయా క్యాన్సర్ బాధితుల కణితుల్లోని ప్రత్యేక జన్యుమార్పుల (నియోయాంటీజెన్స్)ను గుర్తించేలా వీటిని రూపొందిస్తారు. క్యాన్సర్ కణాలను గుర్తించి, వాటిని నిర్మూలించేలా ఇవి రోగనిరోధక వ్యవస్థను తీర్చిదిద్దుతాయి. క్లోమం, పెద్దపేగు క్యాన్సర్లను, ముఖ్యంగా శస్త్రచికిత్స అనంతరం త్వరగా తిరగబెట్టకుండా చూడటంలో గొప్పగా పనిచేస్తున్నట్టు పరీక్షల్లో రుజువైంది.

### వినూత్న ఔషధ వాహకాలు

స్మార్ట్ నానోపార్టికల్స్: కణితి ఉన్నచోటుకే నేరుగా మందులను చేరవేసే స్మార్ట్ నానోపార్టికల్స్ వినూత్న ఔషధ వాహకాలుగా ఉపయోగపడుతున్నాయి. ఇవి కణితి చుట్టుపక్కల ఉండే ఆమ్లం, ఆక్సిజన్ మోతాదులను బట్టి ప్రేరేపితమవుతాయి. వేడి, కాంతి వంటి బయటి ప్రేరకాలతోనే వీటిని ఉత్తేజితం చేయొచ్చు (ఫొటోథెర్మల్ థెరపీ).

చిన్న కణితుల సృష్టి: కీమెథెరపీ మందులకు కణితి ఎలా స్పందిస్తుందో ముందే తెలుసుకుంటే సమర్థంగా చికిత్స చేయటానికి వీలుంటుంది కదా. ఇందుకోసం 3డీ ఆర్గనాయిడ్స్ విధానం పురుడు పోసుకుంటోంది. క్యాన్సర్ బాధితుల కణజాలాన్ని సేకరించి, దాంతో ప్రయోగశాలలో చిన్న కణితులను సృష్టించటం దీనిలోని కీలకాంశం. వీటిపై మందును ప్రయోగించి, అవెలా పనిచేస్తున్నాయో తెలుసుకోవచ్చు. బాగా పనిచేసే మందులతో కీమో చికిత్స చేయొచ్చు. దీని విషయంలో ఐఐటీ హైదరాబాద్ గొప్ప ముందడుగు వేసింది. ఈ పరీక్ష ఇప్పుడు వాణిజ్యపరంగానూ అందుబాటులోకి వచ్చింది.

### క్యాన్సర్ జీవక్రియ మీదే గురి

క్యాన్సర్ కణాల జీవక్రియ తీరే వేరు. దీని మూలంగానే అవి వృద్ధి చెందే శక్తి పొందుతాయి. దీన్ని అస్తవ్యస్తం చేసే మందులు రూపుదిద్దుకుంటున్నాయి. మైటోకాండ్రియాను నిలువరించటం, పోషకాలను గ్రహించుకోకుండా చేయటం ద్వారా క్యాన్సర్ కణాలను ఆకలితో మాడిపోయేలా చేస్తాయి.

### కచ్చిత నిర్ధారణ, పర్యవేక్షణ

క్యాన్సర్ నిర్ధారణ, దాని తీరుతెన్నులను తెలిపే సులభ పరీక్షలూ వస్తున్నాయి.

ద్రవ బయాప్సీ: ఇది రక్తం లేదా ఇతర శరీర స్రావాల్లో ప్రసరించే కణితి డీఎన్‌ఏ, కణితి కణాల భాగాల వంటి వాటిని గుర్తించే పరీక్ష. శరీరానికి కోత పెట్టాల్సిన అవసరం లేకుండా స్రావాల నమూనాతోనే క్యాన్సర్ తీరుతెన్నులను తెలుసుకోవచ్చు. జన్యుమార్పులు, క్యాన్సర్ చికిత్సల పనితీరు, క్యాన్సర్ తిరగబెట్టటం వంటివీ గుర్తించొచ్చు.

మల్టీ క్యాన్సర్ ఎర్లీ డిటెక్షన్ (ఎంసీఈడీ) పరీక్షలు: ఇవి కొత్తరకం రక్త పరీక్షలు. మిథైలేషన్ తీరులను విశ్లేషించే పద్ధతుల వంటివి వీటి కోవలోకి వస్తాయి. ఒక్క నమూనాతోనే పలురకాల క్యాన్సర్లను తొలిదశలో గుర్తించటానికి తోడ్పడతాయి.

స్పేషియల్ అండ్ సింగిల్–సెల్ ఓమిక్స్: ఇవి అధునాతన ఇమేజింగ్, సీక్వెన్సింగ్ పద్ధతులు. కణితిలో ఏయే కణాలు ఎక్కడెక్కడున్నాయో అర్థం చేసుకోవటానికి తోడ్పడతాయి. దీంతో క్యాన్సర్ ఎలా ప్రవర్తిస్తోంది? అది చికిత్సలకు లొంగుతుందా? లేదా? అనేవి కచ్చితంగా అంచనా వేయొచ్చు.

# భారత్‌లో ఉండటం కోహ్లీకి ఇష్టం లేదు.. అందుకే లండన్‌లో సెటిల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ బ్యాటర్, ఆర్‌సీబీ ఆటగాడు విరాట్ కోహ్లీకి భారత్‌లో ఉండటం ఇష్టం లేదని సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేయర్ లియామ్ లివింగ్ స్టోన్ సంచల న వ్యాఖ్యలు చేశాడు. ప్రశాంతమైన జీవితాన్ని విరాట్ కోహ్లీ కోరుకుంటున్నాడని, తన ఫ్యామిలీతో ఎక్కువ సమయాన్ని గడపాలనుకుంటున్నాడని పేర్కొన్నాడు. అందుకోసమే అతడు లండన్‌లో సెటిల్ అయ్యాడని తెలిపాడు.ప్రస్తుతం భారత్‌తో తాను గడుపుతున్న జీవితాన్ని విరాట్ కోహ్లీ పెద్దగా ఇష్టపడటం లేదు.. అందరి కళ్లు ఎప్పుడూ తనపైనే ఉండాలని అతను అస్సలు అనుకోడని పేర్కొన్నాడు. కోహ్లీ చాలా మంచి వ్యక్తి.. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆర్‌సీబీకి ప్రాతినిథ్యం వహించిన లియామ్ లివింగ్ స్టోన్.. తాజా సీజన్‌లో సన్‌రైజర్స్ తరపున ఆడాడు.. ఇటీవలే ఐపీఎల్ ముగియడంతో స్వదేశానికి వెళ్లిన లివింగ్ స్టోన్.. అక్కడ ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్లతో కలిసి ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా కింగ్ కోహ్లీపై ప్రశంసలు కురిపించాడు.

విరాట్ కోహ్లీ అద్భుతమైన వ్యక్తి.. నేను ఎప్పుడూ అతనికి ప్రత్యర్థిగానే ఆడా.. కోహ్లీ ఎప్పుడూ స్మైల్ తోనే కనిపిస్తాడు. అతనితో గొడవకు దిగితే అదే రీతిలో సమాధానం ఇస్తాడు. కానీ స్టేడియంలో మాత్రం పోటీతత్వంతో ఆడుతాడు. కోహ్లీ.. బౌండరీ లైన్ దాటి మైదానంలో అడుగు పెట్టగానే మారిపోతాడు.. కానీ గ్రౌండ్ బయట అతను అద్భుతమైన వ్యక్తి.. చాలా ప్రశాంతంగా ఉంటాడని లివింగ్ స్టోన్ వెల్లడించాడు.

ఆర్‌సీబీ కోచింగ్ స్టాఫ్ మోబాట్, ఆండీ ఫ్లవర్ విరాట్ కోహ్లీ ఆడే విధానాన్ని పూర్తిగా మార్చేశారని లియామ్ లివింగ్ స్టోన్ చెప్పుకొచ్చాడు. కొంచెం దూకుడుగా ఆడాలని, సిక్సర్లు కొట్టాలని కోహ్లీకి సూచించడంతో.. అతడి ఆటతీరు పూర్తిగా మారింది. గతానికి భిన్నంగా కోహ్లీ దూకుడుగా ఆడుతున్నాడు. స్పిన్ బౌలింగ్‌లోనూ భారీ షాట్స్ కొడుతున్నాడని లివింగ్ స్టోన్ పేర్కొన్నాడు.

# ఐపీఎల్‌లో తోపు.. మహారాజా ట్రోఫీలో కేఎల్ రాహుల్‌ని పట్టించుకోని ఫ్రాంచైజీలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్–2026లో అద్భుతమైన ఫామ్‌తో దుమ్మురేపిన టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌కు తన సొంత గడ్డపైనే ఊహించని షాక్ తగిలింది. కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహారాజా ట్రోఫీ టీ20 లీగ్ మెగా వేలంలో రాహుల్‌ను కొనుగోలు చేయడానికి ఏ ఫ్రాంచైజీ కూడా ఇంట్రెస్ట్ చూపించలేదు.. రూ.2 లక్షల బేస్ ప్రైస్‌తో వేలంలోకి వచ్చిన కేఎల్ రాహుల్.. చివరికి అన్‌సోల్డ్ ) ప్లేయర్‌గా మిగిలిపోవడం అందరినీ షాక్ కి గురి చేసింది.



మహారాజా టీ20 లీగ్‌లో కేఎల్ రాహుల్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండే అవకాశం లేదు.. అందుకే ఫ్రాంచైజీలు అతనిపై బిడ్ వేయడానికి వెనుకాడుగు వేశాయి. కాగా.. ఈ ప్రతిష్టాత్మక మహారాజా ట్రోఫీ టీ20 లీగ్ మ్యాచ్‌లు మొత్తం హుబ్లీ, మైసూర్, బెంగళూరు నగరాల్లో జరగబోతున్నాయి.

**ఎందుకు తీసుకోలేదంటే?:**

ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నప్పటికీ కేఎల్ రాహుల్‌ను ఏ జట్టూ తీసుకోకపోవడానికి ప్రధాన కారణం అతడు అందుబాటులో ఉండటంపై స్పష్టత లేకపోవడమేనని తెలుస్తోంది. జూన్ నెలలో భారత జట్టు అంతర్జాతీయ మ్యాచ్‌లతో ఫుల్ బిజీగా ఉండబోతుంది. జూన్ 6 నుంచి ఆఫ్ఘనిస్తాన్‌తో జరగబోయే ఏకైక టెస్ట్ మ్యాచ్‌కు రాహుల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. అనంతరం జూన్ 13 నుంచి జరగనున్న వన్డే సిరీస్‌లోనూ ఆడనున్నాడు. అంతేకాదు, జూలై రెండో వారంలో కూడా వన్డే సిరీస్ కోసం ఇంగ్లాండ్ పర్యటనకు కేఎల్ రాహుల్ వెళ్లనున్నాడు.

**జాతీయ జట్టు బాధ్యతల వల్లే దూరం:**

ఇలా వరుసగా అంతర్జాతీయ మ్యాచ్‌లు, జాతీయ జట్టు బాధ్యతలు ఉండటంతోనే ఈ

# టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో మళ్లీ రచ్చ.. నెట్టింట గంభీర్ వ్యాఖ్యలపై జోరుగా చర్చ



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య జూన్ 6 నుంచి చండీగఢ్‌లో జరగబోయే మొదటి టెస్ట్ మ్యాచ్‌కు ముందు టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఈ సిరీస్ కోసం రిషబ్ పంత్‌ను వైస్ కెప్టెన్సీ పదవి నుంచి తొలగించి, ఆ బాధ్యతలను కేఎల్ రాహుల్‌కు అప్పగించడంపై గంభీర్ ఓపెన్ అయ్యాడు. ఐపీఎల్‌లో 14 మ్యాచ్‌ల్లో కేవలం 312 రన్స్ చేయడమే కాకుండా, సౌతాఫ్రికాతో జరిగిన గత టెస్ట్ సిరీస్‌లో 12.25 యావరేజ్‌తో కేవలం 29 రన్స్ మాత్రమే చేసి పంత్ తీవ్రంగా నిరాశపరిచాడు. ఈ ఫామ్ ఎఫెక్ట్ వైస్ కెప్టెన్సీపై పడినట్లు వార్తలపై గంభీర్ స్పందించాడు.

**కెప్టెన్సీ అనేది బై ప్రొడక్ట్ మాత్రమే:**

రిషబ్ పంత్ వైస్ కెప్టెన్సీ మార్పుపై గంభీర్ మాట్లాడుతూ.. ఆటగాడికి అసలైన బాధ్యత దేశం కోసం ఆడటమే.. కెప్టెన్సీ, వైస్ కెప్టెన్సీ అనేవి కేవలం బై ప్రొడక్ట్స్ మాత్రమే.. పంత్ తన సహజసిద్ధమైన ఆటను మార్చుకోవాలని మేము చెప్పం.. కానీ, మ్యాచ్ సిట్యుయేషన్‌ను బట్టి ఆడటం చాలా ముఖ్యం.. పరుగులు చేయడం, వికెట్లు తీయడమే అసలైన టార్గెట్ అని స్పష్టం చేశాడు.

**నెంబర్ 3 బ్యాటింగ్ పై క్లారిటీ:**

మరోవైపు నంబర్ 3 బ్యాటింగ్ పొజిషన్‌పై కూడా కోచ్ గంభీర్ క్లారిటీ ఇచ్చాడు. దేవదత్ పడిక్కల్ నుంచి గట్టి పోటీ వస్తున్నప్పటికీ, సాయి సుదర్శన్‌కే తాము అండగా ఉంటామని చెప్పాడు. సుదర్శన్‌కు నంబర్ 3లో తగినన్ని అవకాశాలు రాలేదని, ఇంగ్లాండ్‌లో కెరీర్ స్టార్ట్ చేయడం అంత ఈజీ కాదని గంభీర్ గుర్తు చేశాడు. ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించిన సుదర్శన్‌కు లాంగ్ రన్ ఇస్తామని కోచ్ భరోసా ఇచ్చాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌ను 2--2తో డ్రా చేసుకోవడం, గత మ్యాచ్‌ల్లో ఓడిపోవడంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఇండియా ప్రస్తుతం 6వ స్థానానికి పడిపోయింది. దీనిపై గంభీర్ మాట్లాడుతూ.. మేము ఎప్పుడూ పాజిటివ్‌గానే ఉంటాం.. డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న ప్రతి ఒక్కరికీ డబ్ల్యూటీసీ ఫైనల్ చేరతామనే నమ్మకం ఉంది.. మాకున్న క్వాలిటీ, టాలెంట్‌తో మేము ఫైనల్ గెలవలేకపోవడానికి ఎలాంటి కారణం లేదని ధీమా వ్యక్తం చేశాడు.

# బీచ్‌లో మధురిమ బికినీ రచ్చ.. నెటిజన్లు ఫిదా!

టాలీవుడ్‌లో అల్లరి నరేష్ సరసన 'సరదాగా కాసేపు' సినిమాలో హీరోయిన్‌గా నటించి మెప్పించిన అందాల భామ మధురిమ గుర్తుంది కదా! ఆమె అసలు పేరు నైరా బెనర్జీ. సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా రాణించలేకపోయినా, ప్రస్తుతం బాలీవుడ్, ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లలో బిజీగా ఉంటోంది. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ, తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన కొన్ని బికినీ ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. ఆ హాట్ ఫోటోల ముచ్చట్లు, ఇప్పుడు చూద్దాం..



**టాలీవుడ్ జర్నీ గుర్తుందిగా:**

నైరా బెనర్జీ తెలుగు ప్రేక్షకులకు 'మధురిమ'గానే బాగా పరిచయం. 2009లో 'ఆ ఒక్కడు' సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత ఆరెంజ్, షాడో, కొత్త జంట, టెంపర్ లాంటి పెద్ద సినిమాల్లో క్రేజీ క్యారెక్టర్స్ చేసింది. 2015లో దోచేయ్ సినిమాలో ఒక స్పెషల్ సాంగ్‌లో మెరిసిన తర్వాత ఈమె టాలీవుడ్‌కు కాస్త దూరమైంది. కానీ, హిందీ ఇండస్ట్రీలో మాత్రం వరుస ఆఫర్లతో దూసుకుపోతోంది.

**ఆకట్టుకుంటున్న బికినీ లుక్:**

తాజాగా నైరా గోవా బీచ్‌లో దిగిన కొన్ని కిల్లర్ ఫోటోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. రంగురంగుల ఫ్లోరల్ ప్రింట్ ఉన్న హాల్టర్ స్టైల్ బికినీ టాప్, దానికి మ్యాచ్ అయ్యే స్ట్రింగ్ బాటమ్స్ వేసుకుని ఇసుక తిన్నెలపై అద్దాల నటిలా మెరిసిపోయింది. ఇక తడిసిన జుట్టును వెనక్కి వేసి, సన్ కిస్డ్ గ్లామర్‌తో ఆమె ఇచ్చిన పోజులు కుర్రాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి.


**క్యాప్షన్ అదిరింది బాసూ:**

ఈ హాట్ పిక్స్ పోస్ట్ చేస్తూ ఆమె పెట్టిన క్యాప్షన్ కూడా తెగ వైరల్ అవుతోంది. "మషూకా హూ!!! హ్యాండిల్ చేయడం కష్టం కాదు కానీ, మర్చిపోవడం చాలా కష్టం. రెడ్ ఫ్లాగ్ ఆ.. లేక రిలేషన్‌షిప్ గోలా?" అంటూ ఒక క్రేజీ లైన్ రాసుకొచ్చింది. ఇక దీనికి నెటిజన్లు "నువ్వు ఎప్పటికీ రిలేషన్‌షిప్ గోల్స్ క్వీన్‌వే" అంటూ హార్ట్, ఫైర్ ఎమోజీలతో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

**బాలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ హిట్స్:**

నైరా కేవలం గ్లామర్ షోకే పరిమితం కాకుండా నటిగానూ ప్రూవ్ చేసుకుంటోంది. రీసెంట్‌గా అశుతోష్ రాణా, అభిమన్యు సింగ్‌లతో కలిసి ఆమె నటించిన బాలీవుడ్ యాక్షన్–కామెడీ మూవీ 'వన్ టూ చా చా చా' రిలీజ్ అయి మంచి హిట్ కొట్టింది. అలాగే 'మై వైఫ్ రెంటెడ్ మీ అవుట్' అనే మినీ టీవీ సిరీస్‌తో పాటు, 'ఖాకీ 2' లాంటి పాపులర్ వెబ్ సిరీస్‌లలో కూడా నటిస్తూ ఓటీటీలో ఫుల్ బిజీగా గడుపుతోంది.

ఏదేమైనా, సినిమాల్లో ట్రెడిషనల్ లుక్స్‌తో అలరించిన ఈ మధురిమ.. ఇప్పుడు నైరా బెనర్జీగా బాలీవుడ్‌లో గ్లామర్ అండ్ యాక్టింగ్‌తో సెకండ్ ఇన్నింగ్స్ సూపర్బ్‌గా లీడ్ చేస్తోంది. ఇక వెండితెరపైనే కాదు, సోషల్ మీడియాలోనూ ఈమె రేంజ్ రోజురోజుకూ పెరిగిపోతోంది. మరి ఈ ముద్దుగుమ్మ ముందు ముందు మరిన్ని మంచి ప్రాజెక్టులతో తెలుగులోకి కూడా రీఎంట్రీ ఇవ్వాలని ఆశిద్దాం.



# శింబుతో సినిమా చూడాలనుంది: మీనాక్షి

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న కథానాయిక మీనాక్షి చౌదరి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలు అందుకుంటున్న ఈ అందాల నటి, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తమిళ స్టార్ హీరో శింబుపై తన అభిమానాన్ని వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూలో భాగంగా "సినీ పరిశ్రమకు చెందిన ఏ హీరోతోనైనా సినిమా చూడడానికి వెళ్లే అవకాశం వస్తే ఎవరిని ఎంచుకుంటారు?" అనే ప్రశ్నకు మీనాక్షి ఏమాత్రం ఆలోచించకుండా శింబు పేరును చెప్పారు. "సినిమా చూడటానికి వెళ్లాలంటే నేను ఖచ్చితంగా శింబు గారినే ఎంచుకుంటాను" అంటూ సమాధానమిచ్చారు. ఆయన నటన, తెరపై కనిపించే తీరు తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. మీనాక్షి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం అభిమానుల మధ్య చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా శింబు అభిమానులు ఈ వ్యాఖ్యలను ఆనందంగా స్వాగతిస్తూ, వీరిద్దరి కలయికలో ఒక చిత్రం వస్తే చూడాలని ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, తమిళ సినీ వర్గాల్లో వినిపిస్తున్న కథనాల ప్రకారం శింబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఓ భారీ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయికగా నటించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వార్తల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రస్తుతం మీనాక్షి చౌదరి తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో బిజీగా గడుపుతున్నారు. వరుస విజయాలతో ఆమెకు 'అదృష్ట కథానాయిక' అనే పేరు కూడా వచ్చింది. తెలుగులో పలు ప్రతిష్టాత్మక చిత్రాల్లో నటిస్తూనే, తమిళంలోనూ వరుస అవకాశాలను అందుకుంటున్నారు. హర్యానాకు చెందిన మీనాక్షి చౌదరి వృత్తిరీత్యా దంత వైద్యురాలు. విద్యాభ్యాసం పూర్తయ్యాక మోడలింగ్ రంగంలో అడుగుపెట్టి జాతీయ స్థాయి అందాల పోటీల్లో గుర్తింపు పొందారు. అనంతరం సినీ రంగంలోకి ప్రవేశించి తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ అగ్ర కథానాయికల జాబితాలో చోటు సంపాదించారు. ప్రస్తుతం ఆమె నటిస్తున్న కొత్త చిత్రాలపై కూడా సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. వరుస విజయాలతో ముందుకు సాగుతున్న మీనాక్షి చౌదరి పేరు మరోసారి వార్తల్లో నిలవడానికి శింబుపై చేసిన ఈ వ్యాఖ్యలే కారణమయ్యాయి.





Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965